తెలంగాణ

తెలుగు జాతీయ దినపత్రిక

# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం




సంపుటి :02, సంచిక : 341 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, బుధవారం మార్చి 19, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur




# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

- ఆది నుంచి దళితులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ
- దళితులను ముందువరసలో నిలిపింది కాంగ్రెస్ పార్టీయే
- ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది. దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ- వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం వివరాలు 2లో

## చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

- ట్రయల్ కోర్టుల తీరుపై సుప్రీం అసహనం - ప్రజాస్వామ్యంలో పోలీస్ రాజ్యం కారాదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, 18(తెలుగు వెలుగు):** ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీంకోర్టు అస హనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసు ల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిష న్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయ స్థానం తప్పు బట్టింది. వివరాలు 2లో

## నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

అంతకు ముందే కేబినేట్‌లో చర్చించి ఆమోదం




## కమీషన్ల మీదనే కాంగ్రెస్ దృష్టి

- హైడ్రా పేరుతో వసూళ్ల దందా
- పేదల ప్రతాపాలు.. పెద్దలతో ఒప్పందాలు : మాజీమంత్రి కేటీఆర్




**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** అక్రమ వసూళ్ల కోసమే కాంగ్రెస్ పార్టీ హైడ్రాను తీసుకొచ్చిందని మాజీమంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి.. కమీషన్లు ఎక్కడ వస్తాయో అక్కడ దృష్టి పెట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో వసూళ్ల దందా.. మూసీ పేరుతో పేదల ఇండ్లపై పగబట్టిందని విరుచుకుపడ్డారు కేటీఆర్. ఫార్మాసిటీ పేరుతో భూముల చెర.. ఫోర్త్ సిటీ పేరుతో సీఎం కుటుంబ రియల్ వ్యాపారం చేస్తుందని వివరాలు 2లో

## సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది



- నీవు క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నాం
- భారత్‌లో పర్యటించాలని ఆకాంక్షిస్తున్నాం
- సునీతా విలియమ్స్‌కు మోడీ లేఖ

**న్యూఢిల్లీ, 18(తెలుగు వెలుగు):** భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కొన్ని నెలల ఎదురుచూపుల తర్వాత పుడమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం అని సునీతకు లేఖ రాశారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని, ఆరోగ్యంగా ఉండాలని మోదీ ఆకాంక్షించారు. సునీత సాధించిన విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మీ గురించి అడిగి తెలుసుకున్నాను. మీరు వేలాది కి.మీ.దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుంటున్నాం. మీరు తిరిగి వచ్చిన తర్వాత మిమ్మల్ని భారత్‌లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం. తన కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల భారత్ సంతోషంగా ఉంటుందని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు వివరాలు 2లో

## ఓటరు కార్డుతో ఆధార్ అనుసంధానం

అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం కీలక భేటీ



**న్యూఢిల్లీ, 18(తెలుగు వెలుగు):** ఓటరు జాబితాల తయారీలో అక్రమాలు జరిగాయంటూ విపక్షాలు తీవ్రస్థాయితో విమర్శిస్తున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానంపై కీలక ప్రకటన చేసింది. ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఈ అనుసంధాన పక్రియ చేపట్టనున్నట్లు- తెలిపింది. ఇందుకోసం యూనిక్ ఐడెంటి ఫికేష న్ అథారిటీ- ఆఫ్ ఇండియా, ఈసీ సాంకేతిక వివరాలు 2లో



## ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ

- శంభీపూర్ వ్యాఖ్యలపై మండిపడ్డ శ్రీధర్ బాబు

**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** బిఆర్ఎస్ ఎంఎల్‌సి శంబిపూర్ రాజు, మంత్రి శ్రీధర్ బాబు మధ్య మాటల యుద్ధం నెలకొంది. శాసన మండలిలో ఎంఎల్‌సి శంబిపూర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కడుతోంది ఫోర్త్ సిటీ కాదు అని, ఫోర్ బ్రదర్స్ సిటీ- అని శంభీపూర్ రాజు అనడంతో శ్రీధర్ బాబు ఊగిపోయారు. సభలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని బాబు వివరాలు 2లో

## పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

- చర్చలు లేని రోజే కెసిఆర్ వచ్చి వెళతారు
- మామూలు రోజుల్లో సభను ఎదుర్కొనే ధైర్యం లేదు
- దేవాదుల పంపులను ప్రారంభించిన మంత్రులు



**వరంగల్, 18(తెలుగు వెలుగు):** గత పదేళ్లు దేవాదులను నిర్లక్ష్యం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వైఎస్సార్ ఉన్నప్పుడే దేవాదుల ఫేజ్ 1 పూర్తయిందన్నారు. మూడో ఫేజ్ పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేవాదుల పంప్ హౌస్ ఫేజ్ 3 లో భాగంగా నిర్మించిన మోటార్లను మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆన్ చేశారు. ఒక మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పొంగులేటి.. వివరాలు 2లో

## హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు కోటి జరిమానా



**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సంచలన తీర్పు వెల్లడించారు. హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధిస్తూ సంచలన తీర్పునిచ్చారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన కేసు వివరాలు 2లో

## డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్




## తాగునీటి సరఫరాలో సంక్షోభం లేదు

- శాసనమండలిలో మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** ప్రస్తుతం తాగునీటి సరఫరాలో ఎలాంటి సంక్షోభం లేదని మంత్రి సీతక్క తెలిపారు. నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడితే ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. మంగళవారం శాసన మండలిలో ఆమె మాట్లాడారు. భూగర్భ జలవనరులను కూడా సిద్ధంగా ఉంచామని, నీటి సరఫరాను అనునిత్యం పరిశీలిస్తున్నామని, నీటి సమస్యలపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు- చేశామని వివరించారు. వేసవిలో నిరంతరం వివరాలు 2లో

తెలంగాణ తెలుగు-వెలుగు
తెలుగు జాతీయ దినపత్రిక
ప్రతిక్షణం ప్రజల పక్షం



# నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

## - అంతకు ముందే కేబినేట్‌లో చర్చించి ఆమోదం



**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** తెలంగాణలోని కాంగ్రెస్.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బుధవారం ఉదయం 11.14 గంటలకు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ముందుగా కేబినేట్ ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. అనంతరం బడ్జెట్ కాపీలతో భట్టి విక్రమార్క అసెంబ్లీకి చేరుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్ కావడం విశేషం. బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నదనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఓటరు కార్డుతో ఆధార్ అనుంధానం

(మొదటి పేజీ తరువాయి)

నిపుణుల మధ్య త్వరలోనే చర్చలు ప్రారంభం అవుతాయని ఓ ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సందు, వివేక్ జోషీలు మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి, లెజిస్లేచర్ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, ఐటీ- శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవోతో పాటు- ఈసీ సాంకేతిక నిపుణులతో సమావేశమై చర్చించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు- హక్కు ఉంటు-ంది. అయితే, ఆధార్ కేవలం వ్యక్తి గుర్తింపును మాత్రమే నిర్ధారించగలిగే పత్రం. అందువల్ల ఓటర్ల గుర్తింపు కార్డు (ఊఒఈ)ని ఆధార్‌తో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్లు 23(4), 23(5), 23(6) నిబంధనలు, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చేయాలని ఈ భేటీ-లో నిర్ణయించారు. ఇందులో భాగంగా యూఐడీఏ, ఈసీ -టెక్నికల్ నిపుణుల మధ్య చర్చలు త్వరలోనే ప్రారంభం కానున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

# ఫోర్త్ సిటీ కాదు..ఫోర్ బ్రదర్స్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

హితువు పలికారు. శాసన సభలో ఇంతకంటే దారుణంగా మాట్లాడుతున్నారని శంబిపూర్ వివరణ ఇచ్చారు. వేరే సభ విషయాలు ఈ సభలో అనవసరమని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అనడంతో ఈ అంశం సద్దుమణిగింది.

# హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్‌కు కోటి జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

ఒకటి హైకోర్టు వద్ద పెండింగ్‌లో ఉంది. అయితే ఆ విషయాన్ని దాచిన పిటిషనర్ మరో బెంచ్ వద్ద కొత్త పిటిషన్ వేసి ఆర్డర్ తీసుకున్నాడు. ఈ విషయం ధర్మాసనం దృష్టికి రావడంతో జస్టిస్ నగేశ్ ఆగ్రహించారు. ఉన్నత న్యాయస్థానాన్నే తప్పుదోవ పట్టించడంపై మండిపడ్డారు. ఓ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా మరో బెంచ్ వద్ద రిట్ పిటిషన్ ఎలా వేస్తారంటూ ధ్వజమెత్తారు. ఈ మేరకు పిటిషనర్‌కు రూ.కోటి జరిమానా విధించారు. కాగా, ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడే వారికి ఈ తీర్పు ఓ చెంప పెట్టు లాంటిదని పలువురు చర్చించుకుంటున్నారు. మరోవైపు జస్టిస్ నగేశ్ ఇచ్చిన తీర్పు ఇప్పుడు సంచలనంగా మారింది.

# ట్రిపుల్ ఆర్‌తో హైదరాబాద్‌కు మహర్దశ

## - రోడ్ల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** ఆర్ఆర్ఆర్ దక్షిణభాగం అలైన్ మెంట్ చేసి కేంద్రానికి పంపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్ గురించి కేంద్రమంత్రి గడ్కరీతో పలుమార్లు చర్చలు జరిపామని అన్నారు. ఆర్ఆర్ఆర్ పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. వాళ్ల మాదిరిగా తమకు రోడ్లు అమ్ముకునే అలవాటు లేదని బిఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. భూసేకరణకు సంబంధించి సహకరించాలని కోరుతున్నానని వెల్లడించారు. భూములకు మార్కెట్ ధర ప్రకారం చెల్లింపులు చేస్తామన్నారు. అధికారులపై దాడులు చేయించి అభివృద్ధిని అడ్డుకోవద్దని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హెచ్చరించారు. కేంద్రమంత్రి గడ్కరీని పలుమార్లు కలిసి చర్చించామని, మరో రెండు నెలల్లో అనుమతులు వస్తాయని అన్నారు. మూడు,నాలుగేళ్లలో దీనిని పూర్తి చేస్తామని అన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. ఇక, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. దశాబ్ధాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు నా కృతజ్ఞతలు. నేను ముఖ్యమంత్రిగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషం' అని అన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ సిఫార్సు చేసిన ప్రకారమే 3 గ్రూపులతో ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించింది. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం జనాభాలో వీరి జనాభా 3.288గా ఉంది. వీరికి 1 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. మధ్యస్థంగా లబ్ధిపొందిన 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు. వీరి జనాభా 62.748గా ఉంది. వీరికి 9శాతం రిజర్వేషన్ కల్పించారు. కాస్త మెరుగైన ప్రయోజనాలు పొందిన 26 కులాలను గ్రూప్ 3లో వేశారు. వీరి జనాభా 33.963గా ఉంది. వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఏ,బీ,సీ,డీ, కేటగిరీలుగా ఎస్సీ వర్గీకరణను చేసే అవకాశం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వం.. కమిషన్ సిపార్సుతో పాటు- ఎపిరికల్ డేటాను దృష్టిలో పెట్టు-కుని న్యాయపర చిక్కులు రాకుండా ఉండేలా బిల్లును సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 1,38,78,078. వీరిలో మాదిగలు 67,02,609 ఉండగా.. మాలలు 55,70,244 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం మాలల జనాభా కంటే మాదిగల జనాభా 11.3 లక్షలు ఎక్కువ. ఎస్సీల్లో కేవలం ఈ రెండు కులాల జనాభానే 80 శాతం వరకు ఉంటు-ందని ఓ అంచనా. అందరికీ కలిపి 15 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ మొత్తం కోటాలో మాలలే ఎక్కువ లాభం పొందుతున్నారనే గొడవ దశాబ్దాల క్రితమే మొదలైంది. 1972 నుంచి మాదిగ వర్గానికి చెందిన నేతలు ముఖ్యమంత్రుల్ని కలుస్తూ వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. మంద క్రిష్ణ మాదిగ కూడా దీనిపై ఎప్పటినుంచో మాట్లాడుతున్నారు..' 1996 నాటికి మాదిగలు 18 వేల ఉద్యోగాల్లో ఉండగా, వాటిలో 80-90 శాతం నాల్గో తరగతి ఉద్యోగాలే. మరోవైపు, మాలలు అన్ని రకాలవీ కలిపి 72 వేల ఉద్యోగాల్లో ఉన్నారని అన్నారు.

# కమీషన్ల మీదనే కాంగ్రెస్ దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూముల ఆక్రమించుకుంటుందన్నారు. పేదలపై ప్రతాపం చూపిస్తూ.. పెద్దలతో ఒప్పందాలు కుదుర్చుకుంటుందన్నారు. నాడు మద్యం వద్దని చెప్పిన రేవంత్ రెడ్డి.. నేడు మద్యం ముద్దు అంటున్నారని పేర్కొన్నారు. ధరల సవరణ పేరుతో, కొత్త బ్రాండ్ల పేరుతో అక్రమ ఒప్పందాలు చేసుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి.. వాటిపై ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తున్నారని తెలిపారు. రైతుభరోసా రాదు.. రుణమాఫీ కాదు.. పంటలు కొనుగోలు చేయరు.. రూ.500 క్వింటాలు ధాన్యానికి బోనస్ బోగస్ అయింది.. తులం బంగారం ఇయ్యరు.. ఉద్యోగాలు వేయరు.. ఉద్యోగులకు పీఆర్సీ రాదు, డీఏలు ఇవ్వరు అని కేటీఆర్ మండిపడ్డారు. సత్యం వధ.. ధర్మం చెర బట్టిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో అధం పాతాళానికి తీసుకెళ్లారు. ఆర్థికశక్తిగా ఎదిగిన తెలంగాణను ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారు. ఇది పాలన కాదు పీడన.. ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.**కాంగ్రెస్ పాలనలో రైతన్నలను వెంటాడుతున్న కష్టాలు..** కాంగ్రెస్ పాలనలో రైతన్నలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. సాగుకు సరిపడా విద్యుత్, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు రుణమాఫీ కాక, రైతు భరోసా నిధులు విడుదల కాకపోవడంతో అన్నదాతలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముంచుకొస్తున్న ముప్పును ముందే హెచ్చరించినా.. ఈ తెలివిలేని కాంగ్రెస్ సర్కారు తలకెక్కలేదు అని కేటీఆర్ విమర్శించారు. కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టొద్దని మొత్తుకున్నా విషం తప్ప విషయం లేని ముఖ్యమంత్రి వినిపించుకోలేదు. కళ్ల ముందే పచ్చని పంటలు ఎండుతున్నాయని వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రాథమిక నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ పేర్కొన్నారు. ఓవైపు రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం రాక అన్నదాత అల్లాడుతున్న సమయంలో గోరి చుట్టు మీద రోకలి పోటులా పంటలు ఎండటంతో రైతు బతుకు ఆగమైంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ కక్షగట్టి తెచ్చిన కరువు కాబట్టి రైతులను ఆదుకునే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదే. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కూడా జరుగుతున్న ఎండిన ప్రతి ఎకరానికి వెంటనే రూ.25 వేల నష్ట పరిహారం ప్రకటించి వెంటనే చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తే రైతులతో కలిసి కాంగ్రెస్ సర్కారు భరతం పడతాం అని కేటీఆర్ హెచ్చరించారు. జై కిసాన్.. జై తెలంగాణ.. అని కేటీఆర్ నినదించారు.

# తాగునీటి సరఫరాలో సంక్షోభం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి కోసం రిజర్వాయర్ల నుంచి నీటిని సరఫరా చేస్తామని, నీటి సరఫరా అవసరాలకు 2024 జనవరి నుంచి ఇప్పటివరకు రూ.298 కోట్లు- మంజూరు చేశామన్నారు. 34 భారీ తాగునీటి సరఫరా పథకాల కోసం రూ.745 కోట్లు- కేటాయించామని, గ్రామాల్లో నీటి అవసరాల కోసం రూ.175 కోట్లతో ప్రతిపాదనలు పంపామని సీతక్క ప్రకటించారు.

# సునీత విజయాల పట్ల భారత్ గర్విస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తంచేశారు. దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సునీతా విలియమ్స్, వ్యోమగామి బుచ్ విల్మోర్, మరో ఇద్దరు ఆస్ట్రోనాట్‌లతో కలిసి వారు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు పుడమికి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించిన విషయం తెలిసిందే. 2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. వారం రోజులకే తిరిగి భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. నాటినుంచి సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు. ఎట్టకేలకు వీరిరువురు తిరిగి భూమికి వస్తున్నారు. బుధవారం తెల్లావరుజామున వీళ్లు భూమ్మీదకు రానున్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారని అన్నారు. తను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ని కలిసినా.. లేదా బైడన్‌ని కలిసినా.. ఆమె ఆరోగ్యం గురించి విచారించినట్లు పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఆమె సాధించిన ఘనతకు గర్వపడుతున్నారని తెలిపారు. ఆమె భర్త మైఖెల్ విలియమ్స్‌కి సునీతతో పాటు బుచ్ విల్‌మోర్‌కి కూడా ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు.

# చిన్నచిన్న కేసుల్లో బెయిల్ నిరాకరణలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం.. చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయిల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీంకోర్టు ముందుకు తీసుకు రావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. చిన్నచిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోను బెయిల్ మంజూరుచేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

# రిజర్వేషన్ల పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తా...

## ● తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు జరిగే పోరాటానికి ముందుండి నాయకత్వం వహిస్తానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా, నిబద్ధతతో నిర్వహించిన కుల సర్వేను తప్పుబడితే బీసీలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విడమరిచి చెప్పారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును శాసనసభ ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్రంలోని ఆయా బీసీ సంఘాలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2026లో జరిపే జన గణనలో కులగణన చేర్చాలని శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. మనం అందరం కలిసి కొట్లాడితే కుల గణనను ఎందుకు చేర్చరు. కొట్లాడితే తెలంగాణ రాలేదా? కొట్లాడితే దేశానికి స్వతంత్రం రాలేదా? కొట్లాడితే జన గణనలో కుల గణన ఎందుకు చేర్చరు. జన గణనలో ఒకసారి కులగణన చేర్చితే ఆ తర్వాత ప్రతి పదేళ్లకోసారి మరింత స్పష్టత వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన చరిత్రలో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. ఈ ప్రక్రియలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణంగా ఉంది. దీన్ని తప్పుబడితే బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుంది. బలహీన వర్గాలు తమ హక్కుల సాధన కోసం చేసే పోరాటానికి పూర్తి మద్దతుగా నిలబడుతా. ఈ సర్వే పునాది లాంటిది. పునాదిలోనే అడ్డుపడితే మీకు మీరే అన్యాయం చేసుకున్న వారవుతారు. ముందు అమలు చేసుకుని తర్వాత అవసరాన్ని బట్టి సవరణలు చేసుకోవచ్చు. ఈ కుల గణన అందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాంటిది. కులం ముసుగులో రాజకీయంగా ఎదగాలని భావించే వారి ఉచ్చులో పడొద్దని హితవు చెప్పారు.

# పదేళ్లుగా దేవాదుల నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం కమిషన్ల కోసమే తాపత్రయపడింది కానీ.. ప్రాజెక్టును పట్టించుకోలేద న్నారు. సాగునీటి సమస్యకు గత ప్రభుత్వమే కారణమని విమర్శించారు. మిషన్ భగీరథ పేరుతో 39 వేల కోట్లు- ఖర్చు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సమాధానం చెప్పాల్సి ఉంటది కాబట్టే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదన్నారు. చర్చ లేనిరోజునే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ఎద్దేవా వేశారు పొంగులేటి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అసెంబ్లీని ఫేజ్ చేసే దమ్ములేదు.. అందుకే చర్చ లేని సమయంలో.. బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చిపోతున్నారని మండిపడ్డారు. ఇవాళ రాష్ట్రంలో ఉన్న నీటి ఎద్దడికి కారణం కేసీఆరే.. కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది.. కమిషన్ల కోసం శిలా ఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారు.. దేవాదులను నిర్లక్ష్యం చేశారు ఆరోపించారు. ఇక, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనుకున్న దాని కంటే రైతులు ఎక్కువ సాగు చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల పంటల ఎండిపోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నాం.. బడ్జెట్ సమావేశాల కంటే రైతుల సమస్యలే ముఖ్యమని వచ్చాం.. ఎంత పొద్దుపోయినా పంపు ఆన్ చేసి వెళతాం.. నాటి ప్రభుత్వం దేవాదుల పూర్తి చేసి ఉంటే్ ÷తులకు ఈ స్థితి వచ్చేది కాదు అన్నారు. ఇక, అంచనా వ్యయం పెరగడానికి కూడా కేసీఆర్ నిర్లక్ష్యమే కారణం.. తాగునీరు, సాగునీరు సమస్యకు గత కేసీఆర్ సర్కారే కారణమని ఆరోపించారు. ఒక లిఫ్టుతో ఆపరేట్ చేసినా 60-70 వేల ఎకరాల ఆయకట్టు-కు ప్రయోజనం చేకూరేది.. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దేవాదుల ఆయకట్టుకు నీరందించడం సంతోషంగా ఉందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. స్టేషన్ ఘన్ పూర్, జనగామ,పాలకుర్తి,పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు నీరందుతుందన్నారు. గత పదేళ్లుగా దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మార్చి19 న దేవాదుల రావాలనుకున్నాం కానీ..బడ్జెట్ ఉండటంతో ఇవాళే వచ్చామన్నారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట దగ్గర దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పంప్ ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డికె అరుణ ఇంట్లో చొరబడ్డ వ్యక్తి అరెస్ట్



**హైదరాబాద్, 18(తెలుగు వెలుగు):** భాజపా ఎంపీ డీకే అరుణ ఇంట్లో చొరబడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఢిల్లీకి చెందిన అక్రమ్‌గా గుర్తించారు. అతడిని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ పోలీసులు విచారిస్తున్నారు. ఎంపీ ఇంట్లోకి చొరబడేందుకు గల కారణాలను తెలుసుకుంటు-న్నారు. అక్రమ్ గతంలో హైదరాబాద్‌లోని పాతబస్తీ, ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు- సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సీపీ సీవీ ఆనంద్ సోమవారం ఎంపీ ఇంటికి చేరుకుని వివరాలను సేకరించిన విషయం తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 56లోని ఎంపీ నివాసంలోకి నిందితుడు ముసుగు ధరించి ఇంటి వెనుక నుంచి లోపలికి ప్రవేశించాడు. సీసీ కెమెరా వైర్లను కత్తిరించి, సుమారు గంట పాటు- ఇంట్లో తిరిగి అక్కడి నుంచి జారుకొన్నాడు. ఆమె కుమార్తె ఉదయం నిద్రలేచి చూసేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంది. వంట గది కిటికీ గ్రిల్ తొలగించడం గమనించారు. దీనిపై ఎంపీ డ్రైవర్ లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** సదాశివపేట మండల పరిధిలోని వెంకటాపురంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో వెంకటాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఇరవై ఒక్క లక్ష 25 వేల తో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సి డి సి చైర్మన్ గడిల రామ్ రెడ్డి. మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన్న, తాజా మాజీ ఎంపీటీసీ ఒగ్గు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణ, వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం, కో ఆప్షన్ సభ్యులు మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి ముగ్ధుమ్ పటేల్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఆశి రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాగులపల్లి ప్రభు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవీన్, చింటూ గౌడ్, బింబాదర్ చారి, భీమ్ సేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలిగామ గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సీడీసీ చైర్మన్ గడిలరాంరెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** సదాశివపేట మండల పరిధిలోని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో బొబ్బిలిగామ గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ నిధులు 22 లక్షల 50 వేల తో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి. మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్దన్న, గ్రామ మాజీ సర్పంచ్ గోపాల్, రమేష్ పంతులు,పాషా, మాజీ ఎంపీపీ మల్లమ్మ, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి ముగ్ధుమ్ పటేల్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఆశి రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాగులపల్లి ప్రభు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నవీన్, చింటూ గౌడ్, బింబాదర్ చారి, పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యూసుఫ్, భీమ్ సేనారెడ్డి పాల్గొన్నారు.

## సదాశివపేటలో 30 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** సదాశివపేట పట్టణం ముస్లిం సహోదరుల కోరిక మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహాయంతో పట్టణంలోని ఈదగా మరియు కబరస్థాన్కు 30 లక్షల రూపాయల స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ తో బౌండరీ వాల్ నిర్మించడానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మునిసిపల్ కమిషనర్ ఉమా మరియు ఇంజినీర్ కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఎండి చోటు. ఎండి లతీఫ్ , సజ్జి , లైక్ , హాజీ , సాబీర్ , అలీమ్ , రహమత్ , ఖదీర్ వాజిద్ వసీం తోపాటు మత పెద్దలు మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అధికారులను అడ్డుకొని నిరసన తెలిపిన గ్రామస్తులు

**మంథని:** రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధి మేడిపల్లి శివార్ లో గల ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలనకు వచ్చిన అధికారులను రత్నాపూర్ గ్రామస్తులు అడ్డుకొని నిరసన తెలిపారు. కోకో కోలా కంపెనీ ఏర్పాటుకు సుమారు 203ఎకరాల స్థలం అవసరం కానుండగా మంగళవారం రోజున కంపెనీ ప్రతినిధులు,కరీంనగర్ ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ మహేశ్వర్, అధికారులు గ్రామంలో పర్యటించారు. కంపెనీ ఏర్పాటుకు మేము ఏ మాత్రం భూమి ఇచ్చే ప్రసక్తే లేదని వారు తేల్చి చెప్పారు..

## ఎమ్మెల్సీ కవిత పోరాటంతోనే రెండు వేరువేరు బిల్లులు పెట్టిన ప్రభుత్వం

- ఇది తెలంగాణ జాగృతి సాధించిన మరో భారీ విజయం
- బీసీల పక్షాన పోరాటం చేసిన ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలిపిన జాగృతి నాయకులు వేణుగోపాల్ రావు



**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాట ఫలితంగానే బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు పెంచడానికి రెండు వేరువేరు బిల్లులను పెట్టిందని జాగృతి నాయకులు వేణుగోపాల్ రావు స్పష్టం చేశారు. బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేసిన ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గిందని, అందుకు ఎమ్మెల్సీ కవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇది తెలంగాణ జాగృతి సాధించిన మరో భారీ విజయంగా అభివర్ణించారు సుదీర్ఘకాలంగా ఈ దేశంలో అన్ని రకాల అన్యాయాలకు గురైన బీసీ సోదరులకు రిజర్వేషన్ల కోసం విద్యా, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశ పెట్టడం స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా ఉపాధి రాజకీయ రిజర్వేషన్లకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుంది అని ముందే గుర్తించి వేరువేరు బిల్లులు పెట్టాల్సిందే అని డిమాండ్ చేసినది కేవలం జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత మాత్రమే అని గుర్తు చేశారు. మండల్ కమిషన్ రిపోర్టును తొక్కి పెట్టింది మొదలు కులగణన డెడికేటెడ్ కమిషన్ కాకుండా రెగ్యులర్ కమిషన్కు ఇచ్చేవరకు కాంగ్రెస్ ది ద్రోహ చరిత్ర అని అన్నారు. బీసీల సంఖ్య తక్కువగా చూపెట్టినప్పటికీ బీసీ సంఘాల మరియు తెలంగాణ జాగృతి వంటి సంస్థల ఒత్తిడి ఉద్యమంతోనే బీసీ రిజర్వేషన్లు కొలిక్కి వచ్చాయని అన్నారు. బీసీల కోసం బీసీలు మాత్రమే మాట్లాడాలనే కొందరి వాదన బీసీల గొంతును బలహీనపరచాలనే కుట్ర మాత్రమే అని ఆయన అన్నారు. బాధితుల పక్షాన అణగారిన వర్గాల పక్షాన ఎవరు గొంతు ఎత్తినా స్వాగతించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సంపూర్ణంగా 42% బీసీ రిజర్వేషన్లు అమలయ్యే వరకు బీసీలు జాగ్రత్తతో ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. బిల్లులు పాస్ అవుతున్న ఈ కీలక దశలో కేంద్రం మీద ఒత్తిడి పెంచేందుకు బీసీలు సిద్ధంగా ఉండాలని వేణుగోపాల్ రావు పిలుపునిచ్చారు

## అగ్రవర్ణ పేద యువతకు రాజీవ్ యువ వికాస్ పథకం వర్తింప చేయాలి

- రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి దొనూర్ పాండురంగ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సదాశివపేట:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేద యువతకు కూడా వర్తింపచేయాలని రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి దొనూరు పాండురంగ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత కోసం చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం లో భాగంగా 5 లక్షల మంది యువతకు రూ 6 వేల కోట్లతో చేపడుతున్నరు. అయితే ఈ రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ కులాల్లోని పేద యువతకు అవకాశం కల్పించకపోవడంతో తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారు. కులాలతో సంబంధం లేకుండా పేదరికమే లక్ష్యంగా ఏర్పాటు చేయాల్సిన యువ వికాస పథకాన్ని కులం పేరుతో అగ్రవర్ణ పేదలను పక్కకు పెట్టడం ఇది తీవ్ర నిరాశకు గురి చేస్తుందని పాండురంగ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రవర్ణ కులాల్లో పుట్టిన ప్రతి ఒక్కరు ధనవంతులు కారని అందులో ఉన్న పేద యువతకు, నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేదంటే అగ్రవర్ణ పేద కులాల్లోని నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహలకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. గత పది రోజుల క్రితమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లా మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి అనే అగ్రవర్ణ పేద యువకుడు ఉద్యోగం కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు పిల్లలతో సహా భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే అని అన్నారు. ఈ సంఘటన ఒకటి చాలు అగ్రవర్ణ కులాల్లో కూడా పేద యువత, నిరుద్యోగులు ఉన్నారని తెలపడానికి నిదర్శనం అని అన్నారు. కావున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అగ్రవర్ణ పేదలను కూడా దృష్టిలో ఉంచుకొని ఆ నిరుద్యోగ యువతకు కూడా రాజీవ్ యువ వికాస్ పథకంలో వారిని కూడా భాగస్వామ్యులు చేస్తూ ఆ పథకాన్ని వర్తింపచేయాలని రెడీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి దొనూర్ పాండురంగ రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే అగ్రవర్ణ కులాల్లోని నిరుద్యోగ యువతను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో రెడ్డి ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు పల్వట్ల విష్ణువర్ధన్ రెడ్డి రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు మనోజ్ రెడ్డి మరియు పట్టణ రెడ్డి పరివార్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మరియు సభ్యులు పాల్గొన్నారు.

## ఎంఆర్ఎఫ్ యూనియన్ ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** ఎంఆర్ఎఫ్ మెదక్ పరిశ్రమలో 28వ తారీఖు నాడు గుర్తింపు యూనియన్ కాల పరిమితి ముగుస్తున్న సందర్భంగా వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఈరోజు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యక్రమంలో డిసిఎల్ గారికి లెటర్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటీయు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయడం జరిగింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కార్మిక వర్గానికి గీటురాయిగా మిగిలేది సిఐటీయు యూనియన్ అని కార్మికులు హర్షం వ్యక్తం చేయడం జరిగింది



## ఎమ్మెల్సీ అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన రవి కుమార్ యాదవ్





**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి:** కరీంనగర్ – నిజామాబాద్ –మెదక్–ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజి రెడ్డి ని కలిసి అభినందనలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్మొన్న జరిగిన కరీంనగర్– నిజామాబాద్ –మెదక్–ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందిన శాసన మండలి సభ్యులు చిన్నమైల్ అంజిరెడ్డి ని, ఆయన సతీమణి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ని రామచంద్రపురం లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ప్రజలు మద్దతు గణనీయంగా పెరుగుతుందని, అందుకు నిదర్శనం మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంజిరెడ్డి , కొమరయ్య గెలుపెనని అన్నారు, రాష్ట్రంలో ప్రజాసమస్యలపై గళం విప్పిందుకు మరో రెండు గొంతుకలు కలిసాయన్నారు,అంజిరెడ్డి ఎప్పుడు పోరాటయోదులేనని, యువత తరపున పోరాటం చేసి వారికి రావల్సిన ఉద్యోగ,ఉపాధి అవకాశాలు వచ్చేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు రాంరెడ్డి, భోపాల్ రెడ్డి,మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి సీతారామరాజు, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, సీనియర్ నాయకులు రాజిరెడ్డి,గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణుడి విజయంలో సగభాగమై నిలిచిన మహాలక్ష్మికి శుభాకాంక్షలు





**తెలుగు – వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** ప్రతి భర్త విజయం వెనుక భార్య ఉండటం ఎంత వరకు నిజమో తెలియదు కానీ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయంలో సతీమణి మహాలక్ష్మి మాత్రం కీలకంగా వ్యవహరించారు. ముందు టిడిపి అభ్యర్థుల లిస్ట్ లో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేరు ప్రకటించి తిరిగి పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటు బిజెపికి కేటాయించడం ఆ పార్టీ ఎం ఎస్ ఆర్ కె రాజు ను అభ్యర్థిగా ప్రకటించడంతో అనపర్తి రాజకీయాలు ప్రకంపనలు సృష్టించింది. బిజెపి అభ్యర్థిని ప్రకటించినప్పటికీ ప్రస్తుత ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు,కుటుంబ సభ్యులు అధైర్య పడకుండా తమ రాజకీయ చతురత చాటారు. ఇటువంటి సందర్భంలో భర్తకు తోడు నీడ గా నిలిచి టికెట్ సాధించే వరకు నిద్రపోకుండా అహర్నిశలు శ్రమించిన మహిళా శక్తి మహాలక్ష్మి. ఏదైనా ప్రకటించిన అభ్యర్థిని కాదని బిజెపిలోకి రామకృష్ణారెడ్డి ని ఆహ్వానించి పార్టీ అధిష్టానం సీటు ఇవ్వడం అనపర్తి రాజకీయ చరిత్రలో ఒక మైలు రాయిగా చెప్పవచ్చు. పార్టీ తరపున సీటు సాధించడమే కాకుండా వైసిపికి బలమైన నియోజకవర్గంగా ఉన్న అనపర్తిలో తన భర్త ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించేందుకు మహాలక్ష్మి ఒక రకంగా అలుపెరుగని పోరాటం చేశారని చెప్పవచ్చు. భర్తే దైవంగా భావించి తన మామ,టిడిపి వ్యవస్థాపక సభ్యులు, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ నల్లమిల్లి మూలా రెడ్డిని ఆదర్శంగా తీసుకుని తన భర్త రామకృష్ణారెడ్డి విజయంలో కీలక పాత్ర పోషించారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. కాగా అందరినీ ఆప్యాయంగా పలకరించే మహాలక్ష్మి జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు,నల్లమిల్లి అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని వెంట అడవికి నడిచిన జీతవలె, శ్రీకృష్ణుడికి జతగా యుద్ధ భూమిలో పోరాడిన సత్యభామలా, నల్లమిల్లి ఇంట వెలుగులు పంచుతూ, కార్యకర్తల గుండెల్లో ధైర్యం నింపుతూ మా(మన) రామకృష్ణుడి విజయంలో సగభాగమై నిలిచిన మహాలక్ష్మికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అంటూ నల్లమిల్లి సోషల్ మీడియా టీమ్ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి: జగదీశ్వర్ గౌడ్



**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి పనుల కొరకు నిధుల మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ని కలిసిన శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్ పరిధిలోని కాలనీలలో అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ జోనల్ కమిషనర్ .ఉపేందర్ రెడ్డి ని వారి కార్యాలయంలో కలవడం జరిగింది. శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రివర్యులు .రేవంత్ రెడ్డి దిశనిర్దేశంలో, ఇంచార్జ్ మంత్రివర్యులు దుద్దిల శ్రీధర్ బాబు నేతృత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి పనులు చెప్పటడం జరిగుతుందని,శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు ముఖ్యంగా హాఫీజ్ పెట్/మాదాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సరైన లైట్లు లేనందువల్ల పాదచారులు,వాహనదారులు రాత్రి పూట చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు,ముఖ్యంగా చాలా ప్రాంతాల్లో ప్రజలు కనెక్టింగ్ రోడు నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు..

# దేవుళ్లు ఏది చెప్పినా, ఏది చేసినా ఒప్పుకోవాలా?

ప్రతి మత దేవుళ్ళు సర్వజ్ఞులని, అనన్య పరాక్రమ వంతులని, మాయలు మంత్రాలు వచ్చునని వారికి తెలియని విద్య లేదని వారిని వేడుకుంటే, వారికి కావలసిన పూజలు జరిపితే మనల కరుణిస్తారని దోపిడీకి అలవాటు పడిన కొందరు ప్రజలను అజ్ఞానులుగా అమాయకత్వం కలిగిన ప్రజలను లోబర్చుకుని మాయమాటలు కల్లబొల్లి కబుర్లు చెప్పి దేవుళ్ళు అలాంటి వారని ఇలాంటి వారని లేని మహిమలను వారికి జోడించి అనేక మహిమాన్వితులని గొప్ప వారని పరువు మరణించలేదని కేవలం అవతారాలు చాలించారని, సామాన్య ప్రజానీకాన్ని తమ మాయమాటలతో దోచేస్తున్నారు. అన్ని మత గ్రంథాలను పరిశీలిస్తే దేవుళ్ళు కూడా మనుషులకు ఉన్న బలహీనతలు అన్నీ ఉన్నాయని వారికి కూడా భార్యలు ఉన్నారని కొడుకులు ఉన్నారని వారు కూడా మరణం చెందారని మనం గ్రహించవచ్చు. వారు మరణించిన మరల మనం ప్రార్థిస్తే మనల్ని కరణిస్తారని దొంగ మాటలు చెబుతూ దోపిడీదారులు తమ దోపిడీని అవేచ్ఛగా సాగిస్తున్నారు. వాళ్లకు దేవుళ్ళు ఎలా ఉంటారో తెలియదు, వాళ ్ళ ఎలాంటి ఆయుధాలు వాడారో తెలియదు రాతి తో, లోహాలతో వారు ఇలాగే ఉంటారని వారి రూపాలను చెక్కించి వందల కోట్ల రూపాయలతో గుళ్ళు గోపురాలు కట్టించి దేవుళ్ళు ఉన్నారని అబద్ధాలు వల్లె వేస్తూ అర్థం కాని భాషలో శ్లోకాలను చదువుతూ వాళ్ళ జేబులు నింపుకుంటున్నారు. ప్రజాధనాన్ని వ్యర్థం చేస్తున్నారు ప్రజలకు లేకుండా చేస్తున్నారు. కానీ గ్రంథాలను పరిశీలిస్తే అన్ని బలహీనతలు మన దేవుళ్లలో ఉన్నాయని చెప్తున్నాయి. వారు చేసిన అకృత్యాలు ఒకవేళ ఈ కాలములో చేస్తే మనల్ని కటకటాల పాలు చేస్తారు ఎవరు ఒప్పుకోకపోయినను ఒప్పుకున్నను దేవుడు అనే పదార్థం ఉన్నాడన్న ప్రచారం బాగా పుంజుకుంటుంది భక్తి ముసుగులో వ్యాపారం జోరుగా సాగి పోతుంది మన దేశాన్ని ఇంతకు పూర్వం ఎన్నో రాజవంశాలు పాలించాయి అందులో రాముడు కృష్ణుడు లాంటివాళ్ళు కూడా రాజులే ఉండవచ్చు.వారు కూడా రాజ్యాన్ని పాలించారు రాజకుమార్ల లక్షణాలన్నీ వారికి ఉన్నాయి. వారు ఎప్పుడు కూడా దేవుళ్ళ మని చెప్పుకోలేదు రాముడు దేవుడు కాదు.. రాముడు నేను దేవుణ్ణని ఎక్కడా చెప్పలేదు.. వాల్మీకి రామాయణంలో.. రాముడు దేవుడని మనకు ఎక్కడా కనబడదు.రాముడు నేను మనిషినిరా బాబూ అన్నాడు.. రాముడు(రాజు) నేను మనిషిని.. నాతండ్రి గారు దశరథ మహారాజు.. మా పట్టణం అయోధ్య పట్టణం అన్నాడు. శ్రీకృష్ణుడు దేవుడు కాదు.. శ్రీకృష్ణుడు కూడా మాది గోకులం, మధురానగరం అన్నాడు. , భారతంలో భాగవతంలోఅదే ఉంది.అదే రాసి ఉంది.అంతేగానీ రాముడు దేవుడు కాదు.. కృష్ణుడు దేవుడు కాదు.రాముడు మనిషే.. కృష్ణుడు(రాజు) కూడా మనిషి ఎక్కడా కూడా వీళ్ళు దేవుళ్ళు అని చెప్పలేదు.వారిని దేవుళ్ళుగా చిత్రీకరించడం, మనల్ని (ప్రజలను) పిచ్చివాళ్లను చేసి వివిధ రకాల పూజలను,యజ్ఞాలను, యాగాలను, రాళ్లను దేవతా విగ్రహాలుగా చెక్కించడం, మొక్కించడం మధ్య దళారీల పని మాత్రమే.మత గ్రంథాలలోని పాత్రలే దేవుళ్ళుగా ఈ రోజుల్లో పూజిస్తున్నారు వారు చెప్పినవన్నీ ఆచరించినవన్నీ ప్రస్తుతం ఈ సమాజానికి పనికిరావు. వారు చెప్పినవన్నీ ఆచరిస్తే కటకటాల వెనుక ఉండాల్సిందే. ప్రస్తుత సమాజంలో ఇద్దరు భార్యలను పెళ్లి చేసుకోవడం నిషేధం.పురాణాలలో మాత్రం కృష్ణుడికి 8 మంది భార్యలతో సహా ఎన్నో వేలమంది, అలాగే శివుడికి ఇద్దరు.....ఇలాంటివన్ని మనం ఆచరిస్తే రాజ్యాంగ ప్రకారం మనల్ని కటకటాల వెనక్కి తోసేస్తారు. మన పురాణాలలో మహాభారత కథలో ద్రౌపది ఐదుగురిని భర్తలను పెళ్లాడింది అది ఈ కాలానికి తప్పుగా పరిగణిస్తారు. అలా చేసుకుంటే బరితెగించింది అంటారు.ఒక మతంలో ఒక దేవుడు "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అన్నాడు. సమాజంలో ఎన్నో అవకతవకలు జరుగుచున్నవి. స్త్రీలపై అత్యాచారాలు జరుగుతున్నవి.పసి పిల్లలపై అఘాయిత్యాలు చేసి,సజీవ దహనం చేసినా దేవుడు ఎందుకు రావడం లేదు ఎందుకు రావడం లేదు? మోసకారులు మోసాలు చేస్తూనే ఉన్నారు.నేరాలు చేసిన వాళ్ళు తప్పించుకుంటున్నారు. ఇంకెన్ని ఘోరాలు జరగాలి! ఇంకా ఎంతమంది బలి కావాలి!! ఇన్ని అమానుషాలు జరుగుతున్నా దేవుడు ఎందుకు రావడం లేదు అంటే మత గ్రంథాలు చెప్పేవన్నీ అబద్ధాలు అన్నమాట. ఎప్పుడు వస్తాడు దేవుడు? సమాజం మనుషులను కదిలిస్తే ఇది కలికాలం అందుకే ఇలా జరుగుతున్నది అంటారు. ఇవన్నీ తప్పనిసరి జరగాలని ఉన్నట్టు. కానీ కాలానికి ఖండన లేదు.కృతయుగం త్రేతా యుగం ద్వాపార యుగం కలియుగం అంతా బూటకమే...కొందరు ప్రజలు యుగాల మాయలో దేవుళ్ళమాయలో పడి ఇలా మాట్లాడతారు. యుగాలు లెక్క పచ్చి అబద్ధాలు జీవపరిణామ సిద్ధాంతానికి యుగాల లెక్క పూర్తిగా వ్యతిరేకం. యుగాలకు దానికి పొంతన కుదరదు.పురాణాలు చెప్పినట్టుగా బహుభార్యత్వం, వ్యభిచారము దేవుళ్ళు చెప్పినట్టుగా, చేసినట్టుగా ప్రస్తుత సమాజంలో ఆచరిస్తే విలువ ఉండదు. సమాజం సూటిపోటి మాటలతో బాధిస్తుంది. అలా ఎవరు చేయడానికి సిద్ధంగా లేరు. ప్రస్తుత మన భారత రాజ్యాంగం ప్రకారం ఈ క్రిందివి నేరాలుగా పరిగణిస్తారు. ఉదాహరణకు: సతీ సహగమనం, బహుభార్యత్వం, మహిళల పట్ల వివక్షత, బాల్య వివాహాలు, దేవదాసీ, బానిసత్వం, జంతుబలులు మొదలగునవి.అయినను కొన్ని అప్పుడప్పుడు అక్కడక్కడ జరుగుతున్నాయని వింటున్నాం. కొన్ని రోజుల తర్వాత అవన్నీ ఆగిపోతాయి. మూఢత్వంమూర?త్వం ఆగిపోతాయి.గురజాడ వారు అన్నట్టు. "మతములన్నియు మాసి పోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" మన దేవుళ్లు చేసారు కనుక ....మనం కూడా చేయవచ్చని ఎవరూ వాదించడానికి అవకాశం లేదు. మన దేవుళ్లు ఏది చేసినట్టు చెప్పినా... ప్రశ్నించకూడదు అనటం కూడ రాజ్యాంగం ఇచ్చిన భావ స్వేచ్ఛను అడ్డుకునే నేరమే. అసలు దేవుడే లేనిది దేవుడు చెప్పినట్టుగా గ్రంథాలు రాయటం ఏమిటి? ఇదంతా కొందరు మోసకారులు చేసిన దుష్టపన్నాగం.ఏ దేవుడు లేడు ఏ దయ్యం లేదు ఎవరు చెప్పలేదు. మధ్య దళారీలు దేవుని పేరు చెప్పి దోచుకోవడానికి తప్ప మరేం కాదు.అసలు దేవుళ్లు ఇలాంటి పనులు చేయడం ఏమిటీ? ఇలాంటి పనులు చేసిన వాళ్ళు దేవుళ్లు ఎలా అవుతారు? లాంటి ప్రశ్నలు చార్వాకుల కాలం నుంచి ఇప్పటివరకు వినవస్తున్నవే. ప్రస్తుత సమాజంలో కూడా ఎందరో ప్రశ్నించేవారు ఉన్నారు.భవిష్యత్తులో కూడా ఎందరో ప్రశ్నించే వారు పుడతారు.ప్రశ్నకు చావు లేదు ప్రశ్నించే వారిని చంపివేయవచ్చు.కానీ ప్రశ్నను చంపలేరు.పురాణాలు, గుడులు, దేవుడు, పూజ, భక్తి అనే సంసృతి ఎవరికి భౌతికంగా ఉపాదినిస్తుంది? భక్తి మూఢత్వం కారణంగా అందరూ తన సహజ సిద్ధమయిన విచక్షణను కోల్పోతున్నారు? యజ్ఞ యాగాదులు చేయడం వలన, ఎవరికైనా ఐశ్వర్యము కలిగిందా? ఎవరి కష్టాలన్నా వాటితోనే తీరాయా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నం చేయడమే ' హేతుబద్ధ ఆలోచన ' అంటారు. అలా కాకుండా 'మా తాతల నాటి నుంచి ఉన్న మా ఇంటి బావి కలుషిత నీటినే నేనూ త్రాగుతాను' అనే వాదన చేసే వారు... మన పూర్వీకుల మాదిరి ' కలరా ' లాంటి వ్యాధులతో చనిపోవడానికి సిద్ధపడాలి.అంతిమంగా... మన జీవన శైలి రాజ్యాంగం ప్రకారం మార్పులు చెందుతుంది కానీ.... పురాణ కథల నుంచి కాదు. సైన్స్ ను బట్టి సమాజం అభివృద్ధి చెందుతుంది కాని... మత ప్రబోధకులు చెప్పే ఆచరణీయం కాని మాటలతో కాదు.ఆధ్యాత్మికతకు, భక్తికి, మతోన్మాదానికి, మూఢనమ్మకాలకు తేడా తెలియక....మతం, ఆచారాలు, దేవుళ్ల పేరుతో చెపుతున్న విషయాలను గుడ్డిగా అనుసరించడం అంటె... సైన్స్ నుంచి నేర్చుకున్న చదువు సంస్కారాలకు సమాధి కట్టుకొవటమే. మనిషిగా ఆలోచించనట్టే.దేవుళ్ళు ఏది చేసినా ఏది చెప్పినా గుడ్డిగా అనుసరించకూడదు మన మనసుతో ఆలోచనతో ఈ సమాజానికి తగినట్టుగా ఆలోచించి మంచి ఏదో చెడు ఏదో నిర్ధారించి మంచిని ఆచరించాలి అంతే. ఏ దేవుడు చెప్పినా ఏ స్వామి చెప్పినా ,ఏ బాబా చెప్పినా,పెద్దలు చెప్పిన వాటిని మరల మనము ఆలోచించి మంచిని ఆచరించాలి.

– అడియాల శంకర్,అధ్యక్షులు,తెలంగాణ హేతువాద సంఘం.

## చిన్న హంస భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే నివాళులు



**తెలుగు – వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** పెదపూడి మండలం గొల్లల మామిడాడ కు చెందిన వైసిపి యువనేత ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి(చిన్న హంస) ఆకస్మిక మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మంగళవారం ఆకస్మిక మృతి చెందిన సూర్యనారాయణ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి మాజీ ఎమ్మెల్యే సత్తి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఇంకా సంతాపం తెలిపిన వారిలో వైసిపి నేతలు గుత్తుల వెంకటరమణ, సాంబత్తుల చంట,మున్ని, డోకుబుర్ర కృష్ణ, సత్తి సుబ్బారెడ్డి,కర్రి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి వెంకన్న బాబు, కడిమి శ్రీనివాస్, సబ్బెళ్ళ మోహన్ రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, మేడపాటి ముని రెడ్డి,మేడపాటి వీర్రాఘవరెడ్డి, తాడి వెంకట రామారెడ్డి, తాడి గోవింద రెడ్డి తదితరులు ఉన్నారు.

## శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి వైస్ చైర్మన్‌గా కాశెట్టి మోహన్ ప్రమాణస్వీకారం





**శంకర్‌పల్లి , తెలుగు వెలుగు మార్చి 18:** ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్ చైర్ పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి చైర్మన్ కు శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ రైతులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సాతా ప్రవీణ్ కుమార్ వెంకటరామిరెడ్డి శశిధర్ రెడ్డి మండల, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ అంత్యంత కీలకం : చైర్మన్ అనంతరెడ్డి







**తెలుగు – వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ అంత్యంత కీలకమని ఈ దశలో జీవిత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధన దిశగా పయనిస్తే విజయం సాధ్యమని ఎమ్ ఎన్ ఆర్ విద్యాసంస్థల ఛైర్మెన్ మల్లిడి అనంత స త్య నా రా య ణ రె డ్డి అన్నారు.మంగళవారం స్థానిక కెనాల్ రోడ్ లో గల ఎమ్.ఎన్.ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ తాడి సతీష్ రెడ్డి అధ్యక్షతన వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ తమ చిన్నారుల భవిష్యత్ పట్ల తల్లిదండ్రులు ఏర్పరుచుకున్న కలలు, లక్ష్యాలను సాధించి వారికి ఆనందం కలిగించినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత చేకూరుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజం, దేశం పట్ల గౌరవ భావం కలిగి ఉండాలని సమాజంలో జరిగే మంచి చెడుల పట్ల అవగాహన కలిగి ఉంటూ ఉన్నత భావాలు కలిగిన వ్యక్తులుగా రాణించాలన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు అదే కళాశాలలో గల ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఎమ్ఎన్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు మల్లిడి నారాయణరెడ్డి,సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ మల్లిడి మాధవి లత, శ్రీ సాయి మాధవి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్స్ తేతలి రామభద్రారెడ్డి, ఎన్.నవీన్, సత్యభామ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ షేక్ అమన్ రషీద్, పి.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిమ్జ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** నిమ్జ్ పూర్తయితే జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడ తాయి.కలెక్టరేట్‌లో రెవిన్యూ,నిమ్జ్ ప్రత్యేక అధికారితో భూసేకరణ పై కలెక్టర్ సమీక్ష. జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్ ఏర్పాటు కోసం అవసరమైన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు, జహీరాబాద్ ఆర్డీవో, తహసిల్దార్ లతో కలెక్టర్ నిమ్జ్ భూసేకరణ పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిమ్జ్ ఏర్పాటుతో మారుమూల ప్రాంతాలైన జహీరాబాద్ నియోజకవర్గాల రూపురేఖలు మారిపోతాయి అన్నారు.నిమ్జ్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిమ్జ్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన వారికి నష్టపరిహారం అందించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ విషయంపై ఆయా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు ఆయా మండలాలలో గ్రామాల వారీగా చేసిన భూసేకరణ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎంత సేకరణ చేయాల్సి ఉంది అన్న వివరాలను కలెక్టర్ ఆయా మండలాల రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాలలో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పనులు వేగవంతంగా చేసి నిమ్జ్ ప్రాజెక్టు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్డిఓ రామ్ రెడ్డి, తహసిల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**గొల్లపల్లి (తెలుగు వెలుగు):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో గల మోడల్ స్కూల్ లో అఫేన్స్ అగైనేస్ట్ ఉమెన్, సైబర్ సెక్యూరిటీ మరియు రోడ్డు భద్రత గురించి నిర్వహించిన కార్యక్రమంకు ధర్మపురి సిఐ ఏ. రామ్ నర్సింహారెడ్డి మరియు గొల్లపల్లి ఎస్సై చిర్రా సతీష్ హాజరైనారుఇట్టి కార్యక్రమంలో గౌరవనీయులైన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, జగిత్యాల్ డిఎస్పి రఘు చందర్ సూచనలతో కార్యక్రమం ను ఉద్దేశించి ధర్మపురి సిఐ ఏ. రామ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలు పట్ల జరుగు నేరాలు ఈవ్ టీజింగ్ షీ టీం యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, సైబర్ క్రైమ్ 1930 రోడ్డు భద్రత Dial 100 కమ్యూనిటీ పోలీసింగ్ గురించి వివరిస్తూ ఎవరైనా చిన్న పిల్లలు మహిళలు మరియు వృద్ధుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్య తీసుకోబడునని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమానికి గొల్లపల్లి ఎస్సై చిర్ర .సతీష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సుంకర రవి మరియు మోడల్ స్కూల్ సిబ్బంది పోలీస్ కళాబృందం షీ టీం సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది హాజరైనారు.



# 28న దుర్గమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవం..



**తెలుగు వెలుగు న్యూస్ పెద్ద శంకరంపేట్ మార్చ్ 18:** పెద్ద శంకరంపేట కేంద్రంలో ఈనెల 28 నాడు ప్రథమ వార్షికోత్సవం జరుపనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.. 28 ఉదయం 8 గంటలకు దుర్గమ్మ తల్లికి అభిషేకాలు సాయంత్రం నాలుగు గంటల నుండి పెద్ద శంకరంపేట లోని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఏడు గంటలకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.. ఈ కార్యక్రమంలో శంకరంపేట పరిసర గ్రామ ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. మహేష్ శర్మ పంతులు.. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్.. సుభాష్ గౌడ్.. శ్రవణ్.. సీతారామ రావు దేశ్పాండే.. గంగారెడ్డి.. విట్టల్ రెడ్డి.. కోయిలకొండ చంద్రశేఖర్.. నారాయణ.. సర్వేశ్వర్.. రవి వర్మ.. సతీష్ గౌడ్.. ఎర్ర శ్రీహరి వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులు 15 నిమిషాలు ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

**- పెద్ద శంకరంపేట ఎస్ఐ శంకర్..**



**తెలుగు వెలుగు న్యూస్ పెద్ద శంకరంపేట్ మార్చ్ 18:** పెద్ద శంకరంపేట మండలంలోని 10 వ తరగతి విద్యార్థిని విద్యార్థినీలు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా వార్షిక పరీక్షలు రాయాలని ఎస్ఐ శంకర్ సూచించారు. పరీక్ష కేంద్రాలకు 15 నిమిషాల ముందుగా చేరుకోవాలన్నారు. ఎండలు ఉన్నందున తరచు నీళ్లు తాగుతూ సకాలంలో భోజనాలు చేసి అనారోగ్యానికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు అనుమతి లేనందున పోలీస్ వారికి విద్యార్థులు సహకరించాలని ఆయన కోరారు.

# అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టడానికి ఆర్ కృష్ణయ్య పోరాట ఫలితమే...: తేళ్ల హరికృష్ణ



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టడానికి ఆర్ కృష్ణయ్య పోరాట ఫలితమేనని బీసీ నాయకులు తెళ్ల హరికృష్ణ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టడానికి ప్రధాన కారణం గత ఐదు దశాబ్దాల గౌరవ పార్లమెంటు సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణన్న పోరాట ఫలితమే అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, బీసీ సంక్షేమ సంఘం, బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు కూకట్ పల్లి వాస్తవ్యులు తెల్ల హరికృష్ణ తెలిపారు. అసెంబ్లీలో బీసీ బిల్లు మీద చర్చ జరుగుతున్న సందర్భంగా గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మీదకు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు పంచాయతీ ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా బీసీలకు విద్యా ఉద్యోగ ఉపాధి రంగాలలో కూడా రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రవేశపెట్టారు ఈ తరుణంలో చట్టరూపం దాల్చే వరకు ప్రభుత్వం నియమ నిబద్ధతతో కృషి చేయాలని కోరారు అదే రకంగా బీసీ గురుకులాల బలోపేతం బీసీ సంక్షేమ హాస్టల్లో బలోపేతం కోసం రేపు ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల రూపాయల బడ్జెట్ను కేటాయిస్తామన్నారు రేపు బడ్జెట్లో ఆ రకమైన కేటాయింపులు ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు బీసీ విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నాణ్యమైన కోచింగ్ అందించి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని బీసీ లీడర్ తెల్ల హరికృష్ణ తెలిపారు. విద్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్లు మెస్ బకాయిలకు రేపు బడ్జెట్లో నిధులు కేటాయించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.

# సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ









**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** పోక్సో, అత్యాచార కేసులలో బాధిత మహిళలను హక్కు చేర్చుకొని, వారిలో ధైర్యాన్ని నింపాలి.. మెడికో లీగల్ సర్వీస్ లతో పాటు వివిధ స్కూల్స్, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.భరోసా సిబ్బంది సేవలను అభినందించిన జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్. ఈ రోజు తేది: 18.03.2025 నాడు సంగారెడ్డి జిల్లా భరోసా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపియస్., ఆకస్మిక తనిఖీ చేశారు. భరోసా కార్యాలయంలో కౌన్సిలింగ్ రూమ్, మెడికల్ రూమ్, లీగల్ సపోర్ట్ రూమ్, వీడియో కాన్ఫరెన్స్ రూమ్ మరియు రికార్డ్ లను తనిఖీ చేశారు. భరోసా కేంద్రం ప్రారంభమైన నాటి నుండి పోక్సో, అత్యాచార కేసులలో బాధిత మహిళలకు అందించిన సేవలను, నిర్వహించిన కౌన్సిలింగ్స్, మరియు భరోసా సిబ్బంది నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. పోక్సో, అత్యాచార మరియు ఇతర మహిళా సంభందిత కేసులలో భాదితులను హక్కు చేర్చుకొని వారిలో ధైర్యాన్ని నింపాలని అన్నారు. భాదిత మహిళను వెన్నంటి ఉంది వారికి అందించవలసిన మెడికో లీగల్ సేవలను సత్వరమే అందేలా చూడాలని అన్నారు. అవసరమైన కేసులలో హోమ్-విజిట్ చేసి కౌన్సిలింగ్ నిర్వహించాలని అన్నారు. మహిళా సంభందిత నేరాల గురించి వివిధ స్కూల్స్, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర ఉమెన్ సేఫ్టీ అంశాల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. భరోసా సిబ్బంది పనితీరు బాగుందని, వారు అందించిన సేవలను అభినందిస్తూ.. డ్యూటిపరంగా లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురాలని సూచించారు. ఈ విజిటింగ్ నందు సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ రమేష్, భరోసా కో-ఆర్డినేటర్ దేవలక్ష్మి, భరోసా సిబ్బంది తదితరులు ఉన్నారు.

# అంగన్వాడి టీచర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5లక్షలు ఇవ్వాలి
- కాళీ పోస్టులు భర్తీ చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఆఫీస్ లముందు 48గంటల ధర్నా
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, పి రామకృష్ణ



**వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తెలుగు వెలుగు ప్రతినిధి మార్చ్ : 18 బంట్వారం:** అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు 48 గంటల ధర్నా ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని మొబైల్ అంగన్వాడి సెంటర్లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్య విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలి సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అసెంబ్లీ బడ్జెట్ ఐ సి డి స్ కు బడ్జెట్ పెంచాలని అంగన్వాడి టీచర్లకు వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి సిఐటి యు జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ పి రామకృష్ణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నరసమ్మ, జిల్లా కార్యదర్శి భారతి లు మాట్లాడుతూ ఈ కాలంలో ఐసిడిఎస్ సంస్థ గతం చేయాలని ఇందులో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్స్ సెల్పాలను పర్మినెంట్ చేయాలని అనేక సంస్థలు సుప్రీంకోర్టు గుజరాత్ హైకోర్టు తెలియజేశా ఈ అంశాలను పరిశీలించి పరిష్కారం చేయాలని కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతలను విరమించడం లేదు పైగా పేద ప్రజలతో పాటు అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ నష్టం కలిగించే ఐసిడిఎస్ ప్రైవేటీకరణ నిర్ణయాలను అనేకం చేసింది ఇలాంటి పరిస్థితుల్లో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యతిరేక విధాలను అమలు చేయాలని చూడటం అన్యాయం ఐసిడిఎస్ అంగన్వాడి కేంద్రాలకు పోటీగా3-6 సంవత్సరాల పిల్లలతో పీఎం శ్రీ పథకం కింద ప్రీ ప్రైమరీ ఎలిమెంటరీ కేంద్రాలను 28 జిల్లాలలో 56 కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది ఈ నిర్ణయం ఐసిడిఎస్ను నిర్వీర్యం చేసే చర్యలు తప్ప మరొకటి కాదని వారు మండిపడ్డారు మినీ టీచర్లకు పది నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని రిటైర్మెంట్ అయిన టీచర్లకు వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని అర్హత ఉన్న ఆయాలకు టీచర్ పోస్టులు ఇవ్వాలని వేకెన్సీ ఉన్న ఆయా టీచర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ మైపాల్ అంగన్వాడి యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి వనజ మంజుల బేబీ భారతి ప్రమీల సత్యమ్మ విజయలక్ష్మి సెక్టార్ లీడర్లు అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొనడం జరిగింది.

# ఉపాధి హామీ, పంచాయతీరాజ్ పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ ఇంజనీర్ అధికారులతో కలెక్టర్ సమీక్ష. ఉపాధి హామీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాలలో చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారంజిల్లాలో గ్రామీణాభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు అయిన ఈ నెల 24లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాలలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్ల పనులను, ఈ గడువులోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు వేయించాలని అన్నారు.గ్రామీణాభివృద్ధి పనులకు అవసరమైన సాంకేతిక అనుమతులను అధికారులు వెంటనే పొందాలని కలెక్టర్ సూచించారు. అనుమతుల ఆలస్యానికి పనులు నిలిచిపోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.జిల్లాలోని అన్ని మండలాల్లో మస్టర్ లు, జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అలాగే ఆ పనులకు సంబంధించిన ఫోటోలు సిద్ధం చేయాలని DRDA అధికారులకు సూచించారు. ప్రతి అభివృద్ధి కార్యక్రమం పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.పల్లెల్లో నడుస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్ల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. గ్రామాలలో వేస్తున్న రోడ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయడం, మెటీరియల్ సమకూర్చడం, నిర్మాణ నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, రోడ్ల నిర్మాణం సరిగ్గా జరుగుతున్నదని నిర్ధారించుకోవాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతిపాదించిన పాఠశాల అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని సూచించారు. పాఠశాలలకు అవసరమైన రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు మరింత సురక్షితమైన వాతావరణం అందించేందుకు వీటిని ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు.ఇప్పటికే ప్రారంభించిన పనుల పరంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయం పెంచుకుని, ప్రజలకు ఉపయోగ పడేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధి పనులలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువుల్లో పనులను పూర్తిచేయాలని అన్నారు.ఈ సమావేశ లో డి ఆర్ డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు,గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓల్డ్ బోయిన్పల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ బోయిన్పల్లి లోని బడే మసీదు వద్ద ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ లు కురుమయ్యగారి నవీన్ కుమార్, శంబిపూర్ రాజు కార్పొరేటర్లు నరసింహ యాదవ్ ,జూపల్లి సత్యనారాయణ.. సబియా గౌసుద్దీన్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి ,మాజీ కార్పొరేటర్లు బాబురావు, తూము శ్రవణ్ కుమార్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు కఠిక ఉపవాస దీక్షలు ఉండి అల్లాహ్ ను స్మరించుకుంటూ ఈ విధంగా ఇఫ్తార్ విందు చేసుకోవడం ఈ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అల్లా దయతో అందరూ కూడా ఆయురారోగ్యాలతో ఉంటూ తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

# స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీకి అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** స్నేహపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన వినోద్ యాదవ్ అసోసియేషన్ సభ్యులు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీ కార్పోరేటర్ నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ స్నేహపరి కాలనీ వాసులకు ఓపెన్ నాళా సమస్య నుండి విముక్తి కల్పించామని,కొత్తగా వచ్చిన కమిటీ కాలనీ అభివృద్ధి కొరకు మరింత పాటు పడాలని, అందుకోసం ఎప్పటి లాగానే తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్,వెంకటేశ్వర్ రెడ్డి,చలమా రెడ్డి, శ్రీనివాస్,దశరథ్, రాము, నారాయణ రావు,ముస్తక్, వసీం, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సంఘాలు అభివృద్ధికి పాటుపడాలి: బండి రమేష్



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** సంక్షేమ సంఘాలు అభివృద్ధికి పాటుపడాల నీ కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఫతేనగర్ డివిజన్ దీన్ దయాల్ నగర్ బస్తీ అసోసియేషన్స్ ఎన్నికలు జరిగినవి. వాటిలో అధ్యక్షుడిగా విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరిప్రసాద్, స్థానిక ప్రజలు అధిక మెజారిటీతో గెలిపించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు కుకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ని కలిసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ బస్తి సమస్యల అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టి దీన్ దయాల్ నగర్ ను మంచిగా తీర్చిదిద్దాలని బస్తి వారి అందరితో సమైక్యంగా కలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, గోవింద్ ,శివా చౌదరి, రమణ, భరత్, తదితరులు పాల్గొన్నారు.

బుధవారం, 19 మార్చి 2025

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



## పోలీస్ వెల్ఫేర్ ఫార్మసీకు మందుల సరఫరా అవగాహనా ఒప్పందానికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

● జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఐ.పి.ఎస్ వెల్లడి

**కడప మార్చి 18:–** పోలీసు సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నగరంలోని పోలీస్ వెల్ఫేర్ ఫార్మసీ కి కావలసిన మందులను సరఫరా చేసేందుకు అవగాహనా ఒప్పందం చేసుకునేందుకు సీల్డ్ టెండర్ల ను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల 1 వ తేదీ నుండి 2025 మార్చి నెల 31 వరకు మందుల సరఫరాకు అవగాహన ఒప్పందం కొరకు ఆసక్తి కలిగిన మెడికల్ ఏజెన్సీస్ నిర్వాహకులు పాల్గొనవచ్చని ఎస్.పి తెలిపారు. ఈనెల 19 ఉదయం 10 గంటల నుండి ఈ నెల 25 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్ లో తమ సీల్డ్ టెండర్లను దాఖలు చేయవచ్చని జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ పేర్కొన్నారు.

## హౌసింగ్ ఇంటి స్థలం కోసం దరఖాస్తులు ఆహ్వానం: కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి మార్చి 18:–** నగరంలో ఇంత వరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్ లో లబ్దిపొందని అర్హులైన లబ్ధిదారుల నుండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31 వ తేదీలోపు దగ్గరలో ఉన్న వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంతవరకు ఏటువంటి హౌసింగ్ స్కీమ్స్ లో అంటే, టిట్కో హౌసింగ్, నవరత్నాలు హౌసింగ్, దామినేడు, పాడిపేట, బాలాజీ డైరీ, తనపల్లి, వికృతమాల,తో పాటు ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు కాకుండా, మిగతా వారు అర్హులని తెలిపారు. తిరుపతి నగరంలో అర్హులైన లబ్ధిదారుల నుండి డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు, లబ్ధిదారులు మీ దగ్గరలో ఉన్న సంబంధిత వార్డు సచివాలయం లో అమెనిటి సెక్రెటరిని కలసి, లబ్ధిదారుల భార్య, భర్త ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, కులం సర్టిఫికెట్, 3 లక్షల లోపు ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, తదితర పత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



**ప్రొద్దుటూరు మార్చి 18:** ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షులు జేష్ఠది భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పుడు నివేదికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన ఏకసభ్య కమిషన్ రాజీవ్ మిశ్రా 2011 జనాభా లెక్కల ప్రకారం నివేదిక తయారుచేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి అందించడం చాలా దుర్మార్గ చర్య అన్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు కూడా క్షుణ్ణంగా పరిశీలన చేయాలని మనవి మాలలపై పక్షపాతం చూపకూడదని కోరారు. 2025 జనాభా లెక్కల ప్రకారం ఏసీ మాలలు ఎంతమంది ఉన్నారు, ఎస్సీ మాదిగ సోదరులు ఎంతమంది ఉన్నారు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది దాన్ని బట్టి చూస్తే పర్సంటేజ్ అనేది ఎవరికి ఎక్కువ ఎవరికి తక్కువ అనేది నిర్ధారణ జరుగుతుందని, దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సాత్రి లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడెం చెరువు సంపత్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలల పరిరక్షణ పందిటి మోహన్, కడప జిల్లా అధ్యక్షులు హ్యూమన్ రైట్స్ మేకల వెంకటన్న, శ్రీపతి భాస్కర్, దళిత సైన్యం మూటకట్ల ఆశీర్వాదం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొద్దుటూరు పట్టణ అధ్యక్షులు జె పవన్, సాత్రి శేఖర్, రాబర్ట్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల ఆనందోత్సవాలు

**మంగళగిరి మార్చ్ 18:–** మంగళగిరి రెండు రామ మందిరాల వద్ద చేనేత మగ్గాల షెడ్ లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్లూమ్ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేస్తామని తీర్మానించడం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ గుంటూరు పార్లమెంట్ టీడీపీ పద్మశాలి సాధికార సమితి సభ్యుడు జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం చేనేత కార్మికులు బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ కాండ్రు శ్రీనివాసరావు, తెలుగు మహిళా నాయకురాలు వింజమూరి ఆశాబాల హాజరయ్యారు. మగ్గాల షెడ్ లో ఏర్పాటు చేసిన కేక్ ను వారు కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. యువగళం పాదయాత్రలో చేనేత, పవర్లూమ్ కార్మికులకు ఉచిత విద్యుత్ అందజేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, లోకేష్ చేనేత కార్మికుల పక్షపాతి అని నిరూపించుకున్నారన్నారు. లోకేష్ చేనేత కార్మికులకు అవసరమైన రాట్నాలు వంటి పరికరాలు అందించడంతోపాటు ఆటోనగర్లో వీవర్స్ శాల ఏర్పాటు చేసి కార్మికులకు చేనేతలో నైపుణ్యత శిక్షణ ఇప్పిస్తున్నారన్నారు. జిల్లా టీడీపీ పద్మశాలి సాధికారిక సభ్యులు నందం బాబురావు, వంగర పెద లక్ష్మయ్య, జంజం వెంకట సుబ్బారావు, దేశం నాయకులు గోవాడ దుర్గారావు, వాకా మాధవ గౌడ, రుద్ర మురళి, తన్నీరు కృష్ణ, గోసాల రాఘవ, కొల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.



## పోక్సో చట్టం మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం






**కడప మార్చి 18:–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జి. శ్రీదేవి, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు ఒంటిమిట్ట నందుగల ఎంపీడీవో ఆఫీస్ మీటింగ్ హాల్ నందు "పోక్సో చట్టం మొదలగు అంశాలపై సెన్సిటైజేషన్ మరియు అవగాహన కార్యక్రమం" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోక్సో చట్టం అంటే లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012, ఇది పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు ఉద్దేశించబడింది. ఈ చట్టం పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక నేరాల నుండి రక్షణ కల్పించేందుకు, మరియు బాధితులకు మద్దతు ఇచ్చే వ్యవస్థను, నేరస్థులను పట్టుకోవడానికి మెరుగైన పద్ధతులను నిర్దేశిస్తుంది, 2012లో ఈ చట్టం ఆమోదించబడింది, ఎందుకంటే పిల్లలపై లైంగిక నేరాల సమస్యను సమగ్రంగా పరిష్కరించడానికి ఇది అవసరం అని ప్రభుత్వం భావించింది. శిక్షలు:ఈ చట్టం ప్రకారం, లైంగిక నేరాలకు పాల్పడే వారికి కఠినమైన శిక్షలు, తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో మరణశిక్ష, జరిమానాలు మరియు జైలుశిక్ష విధించవచ్చు. 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ రక్షణ కల్పిస్తుంది. విభిన్నమైన నేరాల రక్షణ:లైంగిక వేధింపులు, లైంగిక వేధింపులు మరియు అశ్లీలత వంటి నేరాల నుండి పిల్లలను రక్షించడానికి బలమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందించడానికి ఈ చట్టం రూపొందించబడింది. న్యాయ ప్రక్రియలో పిల్లల ప్రయోజనాలు:న్యాయ ప్రక్రియ యొక్క ప్రతి దశలో పిల్లల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ చట్టం రూపొందించబడింది. వయసు:18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలతో లైంగిక చర్యలన్నీ లైంగిక నేరంగా పరిగణించబడుతుందని చట్టం భావిస్తుంది. పోక్సో ఈ–బాక్స్:ఫిర్యాదులను నమోదు చేయడానికి జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ యొక్క అధికారిక పోర్టల్ లో బటన్ ఉంది సద్వినియోగం చేసుకోగలరు, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీమతి శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి మనోహర్, ఒంటిమిట్ట మండలం మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి కె ఆర్ ఎం ప్రసాద్, డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నిత్యానంద రాజు, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ టి బాబు, ఒంటిమిట్ట సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్, అసిస్టెంట్ డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, మహిళా పోలీసులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, పారా లీగల్ వాలంటరీలు, పానల్ న్యాయవాదులు, ఎన్జీవోలు, మహిళలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## మంగళగిరి రోటరీ సేవలు అభినందనీయం: డీఎంహెచ్వో

**మంగళగిరి మార్చ్ 18:–** మంగళగిరి గణపతి నగర్లోని ఇందిరానగర్ యూపీహెచ్సీకి మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో వైద్య పరికరాలు, గర్భిణీ మహిళలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె విజయలక్ష్మి, రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్ హాజరయ్యారు డాక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా గర్భిణీ మహిళలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నే రత్న ప్రభాకర్ వైద్య పరికరాలను హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ అనూష కు అందజేశారు. అనంతరం డీఎంహెచ్వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. యూపీహెచ్సీకి రోటరీ క్లబ్ అవసరమైన వైద్య పరికరాలతోపాటు ఇనుప ర్యాకు, ట్యూబ్ లైట్లు, వాటర్ ట్యూబ్ వంటివి అందజేయడం అభినందనీయమన్నారు. హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ అందర్నీ సమన్వయం చేసుకుంటూ హెల్త్ సెంటర్ నాది అనుకుంటూ యూపీహెచ్సీ అభివృద్ధి చేయటంతో పాటు జాతీయస్థాయిలో రాష్ట్రంలో ఎన్కాస్ సర్టిఫికెట్ పొందిన తొలి యూపీహెచ్సీగా తీసుకురావడంలో డాక్టర్స్ అనూష కృషిని ఆమె అభినందించారు. ఇతర యూపీహెచ్సీ సిబ్బంది కూడా ఇక్కడకు వచ్చి ఇందిరా నగర్ యూపీహెచ్సీ సిబ్బంది పనితీరును చూసి కొన్ని నేర్చుకొని వెళ్తున్నారన్నారు. గర్భిణీ మహిళలకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేస్తున్నారని, రోటరీ ఇదేవిధంగా ప్రతినెల జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణీలకు పంపిణీ చేసే విధంగా సహకారమందించాలన్నారు. రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ అన్నె రత్న ప్రభాకర్ మాట్లాడుతూ యూపీహెచ్సీలో రోటరీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించిందని, నేడు గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం, వైద్య పరికరాలు అందజేస్తున్న మంగళగిరి రోటరీని ఆయన అభినందించారు. రోటరీ పబ్లిక్ ఇమేజ్ కో– చైర్ అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ కార్పోరేట్ హాస్పటల్ ను తలపించే విధంగా యూపీహెచ్సీ ఉందన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష రోగులకు, హెల్త్ సెంటర్ అభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ యూపీహెచ్సీలో పేదలకు ఎంతో విశిష్ట సేవలు అందిస్తున్నారని, యూపీహెచ్సీకి ఏది అవసరమైన మా రోటరీ క్లబ్ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు డాక్టర్ శరణ్య, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి కార్యదర్శి అందే మురళి మోహన్, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, రోటరీ ఫాస్ట్ ప్రెసిడెంట్ అందే రేవంత్, మెంబర్షిప్ డైరెక్టర్ వూడత శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధులు జొన్నాదుల బిక్షారావు తదితరులు పాల్గొన్నారు.





## సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కాలనీలో పాదయాత్ర: కార్పొరేటర్ రాగం

**శేరిలింగంపల్లి మార్చ్ 18:–** శ్రీరామ్ నగర్ బీ బ్లాక్, సీ బ్లాక్ లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కాలనీలో ఏ ఎం హెచ్ వో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి , జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ భాస్కర్, వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్ రెడ్డి, తదితర జిహెచ్ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర చేపట్టామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. ముఖ్యంగా కాలనీలో రహదారులపై నీరు నిలువకుండా సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి మిగిలి ఉన్న రోడ్డు నిర్మాణం చేయాలని, కాలనీలో ఎత్తైన ప్రాంతాలకు మంచీనీరు లోప్రెషర్ సమస్య ఉందని, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను ఆధునీకరించాలని వీధి దీపాల ఏర్పాటు రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి కంచె ఏర్పాటు చేయడం, పారిశుధ్య నిర్వహణ వంటి సమస్యలు కార్పొరేటర్ దృష్టికి కాలనీవాసులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అన్ని విభాగాల అధికారులతో చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదేశించారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కరం కోసమే కాలనీల్లో పాదయాత్ర చేస్తున్నానని తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న పిజి హాస్టల్స్, సూపర్ మార్కెట్స్, రెస్టారెంట్స్ లను ఏ ఎమ్ హెచ్ ఓ శ్రీకాంత్ రెడ్డి తో, జిహెచ్ఎంసీ సంబంధిత వివిధ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. హైజినిక్ మరియు పరిశుభ్రత పాటించాలని సూచించారు. శ్రీరామ్ నగర్ బీ బ్లాక్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్ రావు, సెక్రటరీ క్రాంతి కుమార్, గోపాల్ యాదవ్, సీ బ్లాక్ జనరల్ సెక్రటరీ రాజేందర్ గుప్తా, జైపాల్ రెడ్డి, పివిఎన్ చారీ, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ శివ కుమార్, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## గద్దరాళ్లలో ఘనంగా మారెమ్మ దేవర ఉత్సవాలు



**దేవనకొండ మార్చి 18:–**మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే గద్దరాళ్ళ మారెమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం కర్నూలు జిల్లా దేవనకొండ మండలం గద్దరాళ్లలో దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు భక్తులు. ఈ ఉత్సవాలకు కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ తదితర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి దేవర కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం నిర్వహించే పల్లె దొడ్డి బోనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దేవర నాడు కొండమీద గద్ద వచ్చి కూర్చోగానే పల్లెదొడ్డి బాణాలు ఊరెళ్తాయని గ్రామ పెద్దలు చదువుతారు. ఈ దేవాలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 12 మంది ఎస్ఐలు, 6 మంది సిఐలు, 200 మంది పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## ఏఎంఐఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**ఆదోని మార్చి 18:–**వేసవికాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు దాహార్తితో ఇబ్బంది పడకుండా వారి కోసం ఏఐఎంఐఎం నాయకులు చలివేంద్రాన్ని ప్రారంభిం చారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆదోనిలో ఏఐఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జునైద్, సద్దాం హుస్సేన్, నాసిర్ హుస్సేన్, అహ్మద్ హుస్సేన్, ఖాసిం, షేక్షావలి తదితరులు కలిసి నిజాముద్దీన్ కాలనీలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్, సిఐ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐఎంఐఎం సభ్యులను వారు కొనియాడారు.



# మద్దతు ధరతో రైతుల నుండి శెనగ, మినుముల కొనుగోలు

**కడప మార్చి 18 :-** జిల్లాలో పండించిన శెనగ, మినుములను రైతుల నుండి మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వం ఏపి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతోందని.. జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ అదితి సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్/ఎన్సిసిఎఫ్ వారి అధ్వర్యంలో ఏపి మార్కెఫెడ్ వైఎస్ఆర్ జిల్లాలో శెనగ మరియు మినుములు పండించిన మరియు e-crop చేయించుకున్నరైతుల నుండి ప్రభుత్వం శెనగ ఒక క్వింటాల్ Rs.5650/- మినుములు ఒక క్వింటాల్ Rs.7400/- మద్దతు ధర పై కొనుగోలు చేయటుకు అనుమతి ఇచ్చిందన్నారు. కావున 11.03.2025నుండి శెనగలు మరియు మినుములు సిఎంఎపిపి నందు రిజిస్ట్రేషన్ అనుమతులు ఇవ్వడం జరిగినదని, రైతులు ఇంకా ఎవరైనా తమ పేర్లను నమోదు చేయించుకొననియెడల, రైతు సేవ కేంద్రంలో పేర్లను నమోదు చేయించుకోవలసిందిగా తెలియచేస్తున్నామన్నారు.జిల్లాలో 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగినది 19.03.2025 వతేదీ నుండి కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. కావున రైతు సోదరులు తమ పంటను ఇంటి దగ్గరే శుభ్రం చేసుకొని కొనుగోలు కేంద్రాలకు తేవలసిందిగా కోరదమైనదని.. ఆమె తెలిపారు.కేవలం ఈ క్రాప్ నందు నమోదు నమోదు చేసుకొన్న రైతుల నుండి మాత్రమే కొనుగోలు చేస్తాము మరియు తేమశాతం 12% లోపల ఉండెలా చూసుకోవాలన్నారు. రైతులు వారి పంటను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి ఈ అవకాశమును జిల్లాలో శెనగ, మినుములు పంట పండించిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఎం. పరిమళజ్యోతి, జిల్లా అధికారి ఏపీ మార్క్ ఫెడ్ కార్యాలయంలో గానీ, కంట్రోల్ రూమ్ - 7095621491కు కాల్ చేసి సంప్రదించవచ్చని కేసి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆధునిక పనిముట్ల కొరకు సలహాలు సూచనల సమావేశం

**కడప మార్చి 18:-** జిల్లాలోని బి .సి కులముల కులవృత్తులు /చేతివృత్తుల కు చెందిన సంఘ నాయకుల వారికి ఆదరణ -3 పధకము క్రింద వారి వృత్తికి అవసరమైన ఆధునిక పనిముట్ల కొరకు సలహాలు సూచనల సమావేశం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బి.సి, కార్పోరేషన్,కడప కార్యాలయం నందు 20న ఉదయం 11.00 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలియజేయడమైనది. కావున బి .సి కులములకు చెందిన కులవృత్తులు /చేతివృత్తుల కు చెందిన సంఘ నాయకులు తప్పకుండ సమావేశము నకు హాజరై జయప్రదం చేయగలరని కోరడమైనది కులవృత్తులు /చేతివృత్తుల కు చెందిన వారునాయిబ్రాహ్మణులు వారు ,రజకులు వారు, వడ్డెర వారు, మత్స్య కారుల వారు , చేనేత వారు, స్వర్ణకారుల వారు , వడ్రంగి పని చేసే వారు పాల వ్యాపారం వారు, కళ్ళు గీత కార్మికుల వారు ,కుమ్మరి వారు,మేదర వారు , వాల్మికి బోయ వారు , కృష్ణ బలిజ పూసల వారు , సగర ఉప్పర వారు , శిల్పి పని చేసేవారు , కరెంటు పని చేసే వారు, ప్లంబింగ్ పని చేసేవారు మొదలగు బి .సి కులములకు చెందిన వారు ఇంకా ఎవరైనా ఉన్నను పై తెలిపిన సమావేశమునకు హాజరై వారి వృత్తికి కావలసిన ఆధునిక పనిముట్ల ఆవశ్యకతను తెలియజేయగలరని కోరడమైనది

# విద్యుత్ భారాలపై చిత్తశుద్ధితో వ్యవహరించాలి

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతి




**కడప టౌన్ మార్చి 18:-** విద్యుత్ భారాలపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఏ.పీ. ట్రాన్స్ కోకు 2014-19 కాలానికి సంబంధించి రూ.1050 కోట్లకు పైగా మిగులు వచ్చింది.. ఆ మేరకు ట్రూ డౌన్ ద్వారా వినియోగదారులకు చార్జీలు తగ్గించబోతున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి, విద్యుత్ భారం తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అఫ్జలా?న్, కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, చిన్నకుల్లాయప్ప, అశోక్రెడ్డి, రహమతుల్లాఖాన్, సయ్యద్ గౌస్ పీర్, రఫీక్ ఖాన్, సిరాజుద్దీన్, పీడీ సంజయ్కాంత, గౌరీదేవి, షేక్ నీలం పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజి రెడ్డి అభినందించిన రవికుమార్ యాదవ్



**శేర్లింగంపల్లి మార్చి 18:-** జరిగిన కరీంనగర్- నిజామాబాద్ -మెదక్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపొందిన శాసన మండలి సభ్యులు చిన్నమైల్ అంజిరెడ్డి ని, వారి సతీమణి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ని రామచంద్రపురం లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ప్రజలు మద్దతు గణనీయంగా పెరుగుతుందని, అందుకు నిదర్శనం మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంజిరెడ్డి , కొమరయ్య గెలుపెనని అన్నారు, రాష్ట్రంలో ప్రజాసమస్యలపై గళం విప్పిందుకు మరో రెండు గొంతుకలు కలిసాయన్నారు,అంజిరెడ్డి ఎప్పుడు పోరాటయోదులేనని, యువత తరపున పోరాటం చేసి వారికి రావల్సిన ఉద్యోగ,ఉపాధి అవకాశాలు వచ్చేలా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు రాంరెడ్డి, భోపాల్ రెడ్డి,మేడ్చల్ జిల్లా అధికార ప్రతినిధి సీతారామరాజు, మియాపూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, సీనియర్ నాయకులు రాజిరెడ్డి,గణేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి: జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి




**రాయచోటి బ్యూరో మార్చి 18:-** అన్ని రకాల ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. మదనపల్లి పట్టణం జి ఆర్ టి స్కూల్ నందు మంగళవారం ఉదయం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్ నందు ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను మార్చి 31వ తేదీ లోపల bsgindia.org ఆన్లైన్ పోర్టల్ నందు నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించవలసిన స్కౌట్ కార్యకలాపాల గురించి వారికి అవగాహన కలిగించారు. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈ మధ్యనే రోడ్డు ప్రమాదంలో మరణించిన స్కౌట్ మాస్టర్ వెంకటరమణ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, ఏ ఎస్ ఓ సి లక్ష్మీకర్, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ మహమ్మద్ ఖాన్, రవీంద్రారెడ్డి, స్కౌట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ సభ్యులు లక్ష్మిరెడ్డి, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టన్స్, కబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

# 29న న్యాయవాదుల సంఘం ఎన్నికలు: ఎన్నికల అధికారిగా రాజ్ కుమార్ రాజు

**రాయచోటి బ్యూరో మార్చి 18 :** ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకుఈనెల 29 న రాయచోటి బార్ అసోసియేషన్ సాధారణ ఎన్నికలు జరిగేటట్లుగా రాయచోటి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షులు ఎన్ ప్రభాకర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి పి రెడ్డయ్య ప్రకటించారు. ఎన్నికలు నిర్వహించడానికి సీనియర్ న్యాయవాది అయిన కే రాజకుమార్ రాజు ను అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఇలియాస్ భాషను ఎగ్జిక్యూటివ్ కమిటీ నియమించినట్లు వారు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయు న్యాయవాదులు నామినేషన్లు వేయడానికి ఈనెల 20, 21,22 మూడు రోజులు ఉంటుందని తర్వాత 24న నామినేషన్ల పరిశీలన 25న నామినేషన్ ఉపచామరించుకోవడానికి సమయం ఉంటుందని 29న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు ఓటు హక్కు ఉన్న న్యాయవాదులందరూ ఓటింగ్ లో పాల్గొనవచ్చని, అదే రోజు ఐదు గంటలకు కౌంటింగ్ మొదలుపెట్టి ఎన్నికల ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారి రాజకుమార్ రాజు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు.

# వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్పును ఆ పార్టీ నాయకులు స్వాగతించాలి

- మహానాడును పండుగలా నిర్వహిస్తాం
- టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



**కడప మార్చి 18 : -** గత వైసీపీ ప్రభుత్వం కడప జిల్లాను, వైయస్సార్ జిల్లాగా మార్పు చేయడాన్ని, వ్యతిరేకిస్తూ చాలామంది ఫిర్యాదులు చేయడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో క్యాబినెట్ సమావేశంలో వైఎస్సార్ కడప జిల్లాగా నిర్ణయించడం జరిగిందని, జిల్లా పేరు మార్పును అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు స్వాగతిస్తున్నాయని, వైసీపీ నాయకులు స్వాగతించాలని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ద్వారకా నగర్ లో ఆయన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లాకు 300 సంవత్సరాల చరిత్ర ఉందని, పుణ్యక్షేత్రాలు, నదులు, పాపికొండలు, దేవుని గడపగా కడప జిల్లా ఎంతో ప్రసిద్ధి గాన్చిందని చెప్పారు. భారత స్వతంత్రం సంగ్రామంలో జిల్లా వాసులు పాల్గొన్నారని, అందులో కడప కోటిరెడ్డి ఒకరిని అన్నారు. దేశాన్ని పాలించిన ఇందిరా గాంధీ, వాజ్పేయి లాంటివారు ఇలా వ్యవహరించి ఉంటే, జిల్లాలు పేరు మార్పుతో ఉనికి కోల్పోయి ఉండేవని అన్నారు. వైయస్సార్ కడప జిల్లాగా పేరు మార్పుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ చేస్తున్నానని అన్నారు. అమరజీవి ఆత్మార్పణతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, నెల్లూరు జిల్లాను, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా పేరు మార్చారే గాని, పేరులో నెల్లూరు ను తొలగించలేదని చెప్పారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభివృద్ధి చేశారు కాబట్టే, జిల్లాకు ఆయన పేరును అలాగే ఉంచారని అన్నారు.మే నెలలో నిర్వహించే టిడిపి మహానాడు కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తామని, త్వరలో మేము మహానాడు నిర్వహించేందుకు నాలుగు చోట్ల స్థలాలు పరిశీలించామని, ఆ స్థలాలను మహానాడు కమిటీ పరిశీలన చేసి, ఎక్కడున్నది నిర్ణయిస్తుందని చెప్పారు.

# మహిళా లబ్దిదారులకు కుట్టు మిషన్ శిక్షణ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రొద్దుటూరు మార్చి 18:-** మున్సిపాలిటీ పరిధిలోని మహిళలు కుట్టు మిషన్ శిక్షణ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ం 25 సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బి.సి. కార్పోరేషన్, కాపు కార్పోరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ మరియు బ్రాహ్మణ కార్పోరేషన్లకు సంబంధించిన మహిళా లబ్దిదారులకు బి.సి. కార్పోరేషన్, కడప వారి ద్వారా కుట్టు మిషన్ శిక్షణ కొరకు దరఖాస్తు ఏపి ం ఓబిఎంఎంఎస్ ద్వారా వారి పేరును ఆన్లైన్ లో నమోదు చేసుకొనుటకు ఈనెల 22వరకు అవకాశం కల్పించబడినదని వివరించారు. ఎంపిక కాబడిన లబ్దిదారులకు శిక్షణ అనంతరం 75% పైగా హాజరు కలిగిన వారికి సర్టిఫికేట్ మరియు ఉచితముగా కుట్టు మిషన్ అందజేయబడునని తెలిపారు. నమోదు చేసుకునే వారు 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు, తెల్ల రేషన్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రములు మరియు ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి వుండాలని, ఒక కుటుంబం యొక్క తెల్ల రేషన్ కార్డు నందు ఒక్కరు మాత్రమే లబ్ది పొందుటకు అర్హులని, శిక్షణ కొరకు నమోదు చేసుకొనేటప్పుడు ఈ దిగువ తెలిపిన కాల వ్యవధిలో ఏదైనా ఒక సమయాన్ని లబ్దిదారు ఎంపిక చేసికొనవచ్చునని వివరించారు. 45 రోజులు - అనగా రోజుకు 8 గంటల శిక్షణ, 60 రోజులు - అనగా రోజుకు 6 గంటల శిక్షణ, 90 రోజులు - అనగా రోజుకు 4 గంటల శిక్షణ వుంటుందని తెలిపారు. అర్హతలున్న వారు http://apobmms.apcfss.in/ వెబ్ సైట్ లో 22వ తేదీ లోగా సంబంధిత సచివాలయం నందు వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

# పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**ఆలూరు మార్చి 18:-** బిజెపి పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మ తోట రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆలూరు లో బిజెపి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి కోసం చేయాల్సిన ప్రణాళికలను, కార్యకర్తలు నాయకులు చేయాల్సిన విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు బసవరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుధా, అంకాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన సర్పంచ్ నూక జైపాల్ రెడ్డి

- కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం... అందచేత...



**ఓబులవారిపల్లి మార్చి 18 :-** మండల కేంద్రమైన ఓబులవారిపల్లి పంచాయతీలోని పుటికవారిపల్లి మరియు బొంత వారి పల్లి గ్రామాలలో గుండెపోటుతో మృతి చెందిన బియ్యాల రామమోహన్ మరియు జవ్వాది లక్ష్మయ్య భౌతిక కాయాలకు పూలమాలు వేసిన నివా లు లు అర్పించి వారి కుటుంబ సభ్యులు పరామర్శించి ఒక్కో కుటుంబానికి 5000 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించి సర్పంచ్ నూక జైపాల్ రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు పేదల పక్షాన ఎక్కడైనా దళితులు సమస్యలలో ఉంటే వారికి సమస్యలు పరిష్కరించి అందరివాడుగా మనల్ని పొందుతున్న జైపాల్ రెడ్డిని ప్రతి ఒక్కరు అభినందనలు తెలియజేస్తున్నారు

# జిల్లా పేరులో "కడప"అనే పదాన్ని పునరుద్ధరించడం శుభ పరిణామం



**ప్రొద్దుటూరు మార్చి 18:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, మన జిల్లా పేరు లో "కడప" అనే పదాన్ని పునరుద్ధరించి, జిల్లా పేరును "వైఎస్సార్ కడప" జిల్లా గా మార్పు చెయ్యాలని నిర్ణయం తీసుకోవటం శుభపరిణామం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన హామీల ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2022 వ సంవత్సరం నుంచి జిల్లా పేరు లో కడప ని పునరుద్ధరణ చెయ్యాలని వివిధ కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందని, కడప అంటే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి తొలి గడప అని మనందరికి తెలుసని, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కడప ని జిల్లా పేరు లో పునరుద్ధరణ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, రాష్ట్ర ప్రభుత్వానికి మా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, కడప పేరు కు ఉన్న విశిష్టత ను, చారిత్రక నేపథ్యం ని సంరక్షించాలని కోరారు.

# జిల్లా కోర్టు వార్షికోత్సవానికి ఆహ్వానం

**పత్తికొండ మార్చి 18:-**కర్నూలు జిల్లా న్యాయస్థానం లో నిర్వహించే వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం పత్తికొండ న్యాయవాదుల సంఘం భవనంలో ఆహ్వాన పత్రికను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రవిగువేరతో కలిసి సీనియర్, జూనియర్ న్యాయవాదులకు అందజేశారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి హైకోర్టు జడ్జి, అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.ఎస్ భానుమతి తో పాటు శ్రీనివాస్ రెడ్డి, హరినాథ్, హరినాథ శర్మ, జిల్లా జడ్జి కబర్ది హాజరవుతారన్నారు ఈ కార్యక్రమంలో జూనియర్ సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు



# గ్రామ సచివాలయ హెల్త్ కార్యదర్శులకు పదోన్నతి

**తుగ్గలి మార్చి18:-** తుగ్గలి మండలంలో పనిచేస్తున్న గ్రామ సచివాలయ హెల్త్ కార్యదర్శులకు జిల్లా వైద్య పదోన్నతి కల్పించారు. మంగళవారం జిల్లా కార్యాలయం నుండి వచ్చిన సమాచారం రాతన, ఎద్దులదొడ్డి, రాంపల్లి ,ఎర్రగుడి, గ్రామ సచివాలయం లో హెల్త్ కార్యదర్శులు గా పనిచేస్తున్న శ్రీదేవి, దీప ,రోజా, సుజాత లకు మంగళవారము ఎం. పి . హెచ్. ఏ (ఎఫ్) గా పదోన్నతులు కల్పిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దీప ఆర్ఎస్ పెండేకల్ సబ్ సెంటర్ కు, రోజా మారెళ్ళ కు, శ్రీదేవి హెూల గుందకు, సుజాత కు కొలిమిగుండ్ల సబ్ సెంటర్లకు కు బదిలీ చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు.

# పంట నష్ట పరిహారం రైతుల ఖాతాలలో జమ చేయాలి



**పత్తికొండ రూరల్ మార్చి 18:-** పంట నష్టపరిహారం రైతుల ఖాతాలలో పూర్తిగా జమ చేయాలని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు ఎం. కారన్న, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్ద ఈరన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దూదేకొండ గ్రామంలో రైతులను కలుసుకొని ఏపీ రైతు సంఘం సభ్యత్వాలను చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు అరకొరగా రైతుల ఖాతాలలో జమ చేసిం దని, నష్టపోయిన రైతులందరికీ పూర్తిగా పంట నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి 20 వేల రూపాయలు ఇస్తామని రైతులకు హామీ ఇచ్చి అధికారం చేపట్టి ఏడాదికావస్తున్న హామీని నెరవేర్చింది లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీ రైతు సంఘం చేపట్టబోయే ఉద్యమాలలో రైతులు భాగస్వామ్యం కావాలన్నారు.

# సిరి ధాన్యాలతో ఆరోగ్యం కర పత్రికలు విడుదల



**ఉరవకొండ మార్చి 18: –** ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆర్యులు అన్నారు. సిరి ధాన్యాలతో ఆరోగ్యం కార్యక్రమం ఈనెల 23న పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీ నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. డాక్టర్ కరి బసవ రాజేంద్ర స్వామి చేతుల మీదుగా విడుదల చేశారు. ఆరోగ్య ప్రియులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయుర్ సంస్థ నిర్వాహకులు తాటికొండ వెంకట్ పిలుపునిచ్చారు.

# చెరువులో చేప పిల్లలను వదిలిన తహాశీల్దార్, సి.మునివేలు

**బొమ్మనహాళ్ మార్చి18:-** బొమ్మనహాళ్‌లోని శ్రీధరఘట్ట గ్రామ చెరువులోకి మత్స్యశాఖ అధికారులు మంగళవారం చేపపిల్లలను వదిలారు.చేపపిల్లలు వదలడంలో ఆలస్యం జరిగింది. బొమ్మనహాళ్ తహాశీల్దార్,సి.మునివేలు సమక్షంలో 16,400 చేపపిల్లలను పీఎంఎంఎస్వై పథకం కింద 40 శాతం సబ్సిడీతో 16400 చేపపిల్లలను వదిలారు,ఎఫ్డీఓ పెద్దబాబునాయక్ మాట్లాడుతూ మత్స్యకార్మికులు లబ్ధి కోసం వారి జీవనోపాధిని కల్పించేందుకు చేపపిల్లల పెం పకం చేపడుతుందని అన్నారు,16400 చేపపిల్లలను వదలడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ పథకాల ద్వారా మత్స్యకార్మికులు కుటుంబాలు లబ్ధి పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి,మత్స్య కార్మిక సంఘం అధ్యక్షులు పక్కీరప్ప, డిస్ట్రిబ్యూటరీ ఉపాధ్యక్షులు మల్లికార్జున,టీడీపీ నాయకులు లింగప్ప,ఉప్పర అనిల్, ఉప సర్పంచ్ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు,



# జైలు జీవితం అనంతరం సత్ప్రవర్తనతో మెలగాలి

**• జిల్లా జైలు మరియు మహిళా జైలు తనిఖీ**



**కర్నూలు మార్చి 18:-**వేద కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు జైలు జీవితం అనంతరం సత్ప్రవర్తనతో జీవించి మంచి పేరు తెచ్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి/జిల్లా న్యాయ సేవాది కార సంస్థ అధ్యక్షులు జి. కబర్ది మరియు కార్యదర్శి శ్రీ బి. లీలా వెంకట శేషాద్రి అన్నారు. మంగళవారం కర్నూల్ పురుషుల కేంద్ర కారాగారము మరియు మహిళ కారాగారాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేసి "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్" గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. కొందరు ఖైదిలు బెయిల్ మంజురైనా జామిను దారులు లేక జైలు లో ఉన్నామని జిల్లా జడ్జి గారికి తెలుపగ వారి కేసులను విచారించి బెయిల్ మంజురుకొరకు తగిన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లాయర్ శివరాం మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం: రామోజీ ఇమ్మానియేల్



**ప్రొద్దుటూరు మార్చి 18:-** ఎస్సీ వర్గీకరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షులు రామోజీ ఇమ్మానియేల్ తెలిపారు. మంగళవారం ఆయన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర ప్రజా సంఘాల నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, కూటమి ప్రభుత్వం రాజకీయ పబ్బం కోసం దళితుల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. ప్రజలకిచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు, శాంతి భద్రతల పైన కూటమి ప్రభుత్వం మొదట దృష్టిపెట్టాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సమస్యలను దృష్టి మళ్లించడానికి ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెడుతున్నారని, ఎస్సీ వర్గీకరణ బిల్లు దుర్మార్గ చర్య అని, దీనికి రాష్ట్ర మాలమహానాడు వర్గం తీవ్రంగా ఖండిస్తున్నామని వివరించారు. రానున్న కాలంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తీవ్ర ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మురళీ ప్రసాద్, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు ఆకుమల్ల ప్రణయ్ కుమార్, రాష్ట్ర సమన్వయకర్త మేకల ఓబులేసు, అరుణ్ కుమార్, సంగటి పుల్లయ్య, సాత్రి లక్ష్మయ్య, చంద్రబాబు, పందిటి మోహన్, నాగరాజు, నారాయణ రామారావు, మరియు దళిత ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సెట్టూరు మండలంలో వెంటనే ప్రారంభించాలి

**• ఎమ్మార్పీఎస్, ఎస్సీ ఎస్టీ ప్రజాసంఘాల డిమాండ్**

**బొమ్మనహల్ మార్చి 18:-** అనంతపురం జిల్లా అంటేనే, కరువు జిల్లా,అందులో కళ్యాణదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడిన నియోజకవర్గం, సెట్టూరు మండలంలో గత రెండు సంవత్సరాల క్రితం మంజూరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను వెంటనే ప్రారంభించాలి విద్యార్థులకు సరైన వసతి భవనాలులేక,మంజూరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ప్రారంభించకుండా అధికారులు కాలయాపన చేస్తూ వచ్చినారు,అనంతపురం జిల్లా ఎమ్మార్పీఎస్,ఎస్సీ ఎస్టీ సంఘాలు, విద్యార్థి సంఘాల ముఖ్య నాయకులు,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటింగ్ కమిటీ సభ్యులు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం సెట్టూరు మండలం ములకలేడు (పెరుగు పాల్యం,) వద్దగల సాంఘిక సంక్షేమ వసతి గృహంను పరిశీలించడం జరిగింది, ఈ యొక్క సంక్షేమ హాస్టల్ నందు సుమారుగా 500 మంది విద్యార్థులు చదువు కునేందుకు భవనాలు అనుకూలంగా ఉన్నాయి కొన్ని మరమ్మత్తులు కల్పించుకొని, ఈ భవనాలలో నిర్వహించే కొనుటకు అనుకూలంగా ఉన్నందున,అనంతపురం జిల్లా కలెక్టర్ మరియు ప్రభుత్వ అధికారులు, స్థానిక కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమీలినేని సురేంద్రబాబు వెంటనే చొరవ తీసుకుని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, నిరుపేద విద్యార్థుల చదువుకు తోడ్పాటు అందించాలని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి,డాక్టరేట్ అవార్డు గ్రహీత హెచ్, అక్కులప్పమాదిగ, ఎమ్మార్పీఎస్ అనంతపురం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు టైగర్ వన్నూరుస్వామి మాదిగ, ఎస్సీ ఎస్టీ మానిటింగ్ కమిటీ సభ్యులు నిర్మెట్లఎల్లన్న మాదిగ, ఎమ్ఎస్ఎఫ్ నగేష్, ఎస్సీ ఎస్టీ పరివేక్షణ సమితి ప్రధాన కార్యదర్శి కుల్లాయప్ప, విద్యార్థి సంఘం నాయకులు పాపిరెడ్డిపల్లి పృధ్వి, ఎమ్మార్పీఎస్ కళ్యాణదుర్గం నియోజకవర్గం అధ్యక్షులు లక్ష్మణమూర్తి, అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు చింతర్లపల్లి గౌరయ్య మాదిగ, కళ్యాణదుర్గం పట్టణ అధ్యక్షులు జన్నే సురేష్ బాబు మాదిగ, కళ్యాణదుర్గం మండలం అధ్యక్షులు విట్లంపల్లి ధనంజయ మాదిగ, బ్రహ్మసముద్రం మండల అధ్యక్షులు ఆర్, లక్ష్మన్న మాదిగ, బొబ్బర్లపల్లి రాజశేఖర్ మాదిగ, మల్లెల నారాయణ మాదిగ, మొదలగు వారు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి

**• జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



**కర్నూలు మార్చి18:-** జిల్లాలో గంజాయి సాగు, మత్తు పదార్థాల సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో "నార్కోటిక్స్ కో ఆర్డినేషన్" సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా యూనివర్సిటీలు, మెడికల్ కళాశాలలు, ఇతర కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం లేకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఇలాంటివి ఏవైనా జరుగుతుంటే దాచి పెట్టవద్దని, విద్యార్థుల భవిష్యత్తు కు సంబంధించిన అంశమని, వెంటనే పోలీస్ కు సమాచారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రతి పాఠశాల, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలు, టోల్ ఫ్రీ నంబర్ వివరాలతో శాశ్వతంగా ఉండే విధంగా హోర్డింగ్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డీఈవో ను ఆదేశించారు.పొలాల్లో గంజాయి సాగు గురించి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు వీఆర్వో ల ద్వారా సమాచారం తీసుకుని పోలీసు శాఖకు అందించాలని ఆదోని సబ్ కలెక్టర్, ఆర్డీవో లను ఆదేశించారు.ఎక్సైజ్, అటవీ శాఖల అధికారులు కూడా గంజాయి సాగు, మత్తు పదార్థాల వినియోగం పట్ల నిఘా ఉంచాలని ప్రాంతాల్లో కూడా గంజాయి సాగుపై నిఘా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, ప్రతిజ్ఞ ల ద్వారా విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని డీఈవో ను ఆదేశించారు.ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించుకోవాలని ఎస్పీ డిఈఓ కు సూచించారు. మిరప పంట మధ్యలో గంజాయి సాగు చేసే అవకాశం ఉన్నందున వ్యవసాయ శాఖ వారు రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు గంజాయి సాగు చట్టపరంగా నేరం అనే విషయం పూర్తిగా అర్థమయ్యేలా వివరించాలని ఎస్పీ జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచించారు. కర్నూలు నగరంలో ఉన్న వార్డు సెక్రటేరియట్ లు వచ్చే ఫిర్యాదులను పోలీస్ శాఖకు అందించేలా అడ్మిన్ సెక్రటరీకి తగిన ఆదేశాలు జారీ చేయాలని ఎస్పీ అడిషనల్ మున్సిపల్ కమిషనర్ను ఆదేశించారు. బస్సులు, రైళ్ళ ద్వారా వీటి రవాణాను పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ అంశంపై డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల వినియోగానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ పి పేర్కొన్నారు.సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, అదనపు మున్సిపల్ కమీషనర్ ఆర్జీవి కృష్ణ, ఎక్సైజ్ సూపరిన్టెండెంట్ సుధీర్ కుమార్, పాల్గొన్నారు.

# బంగంపేట హైవేలో... ప్రయాణం డేంజర్...

**• ఆదమరిస్తే అంతే సంగతులు**

**• దుమ్ము ధూళి కాలుష్యం ఆపైన వాహనాల రద్దీ రద్దీ**

**• నరకయాతన అనుభవిస్తున్న వాహనదారులు**



**ఓబులవారిపల్లి మార్చి 18:-** రైల్వే కోడూరు నియోజకవర్గం కడప చెన్నై ప్రధాన రహదారి బంగంపేట హైవేలో ప్రయాణం ఆదమరిస్తే అంతే సంగతులు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఒకపక్క ముగ్గురాయి లారీలు వాహనాలు రద్దీ ఆపైన దుమ్ము ధూళి కాలుష్యంతో ఎదుటి వస్తున్న వాహనాలు కూడా లైటింగ్ కనిపించుకోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడ్డారు అయినప్పటికీ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారు తప్ప రోడ్డు ప్రమాదాలకు శాశ్వత నివారణ చర్యలు మాత్రం చేపట్టలేదని తెలుస్తోంది ఏది ఏమైనా ఈ హైవేలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా డేంజర్ గా మారుతుందని మారిందని ప్రయాణికులు విమర్శిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ రోడ్డుపైన ముగ్గురాయి లారీలు ట్రాన్స్పోర్ట్ చేస్తూ రవాణా సాగిస్తూ బైయర్లు అటు కంపెనీ యజమానులు కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుని సంపాదిస్తున్నారు కానీ రోడ్డుపై నీళ్లు చల్లి దుమ్ము ధూళి కాలుష్యాన్ని అరికట్టి ప్రమాదాలను నివారించలేకపోతున్నారని అటు ప్రయాణికులు ఇటు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పాలకులు నాయకులు చొరవచూపి రోడ్డు ప్రమాదాలను అరికట్టి రోడ్డు మరమ్మతు పనులు కూడా చేపట్టాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు

# సమాజానికి తమ వంతు సేవ చేయాలన్న తలంపు అభినందనీయం

**• సామాజికవేత్త సేవకుడు జూటూరు అబ్దుల్ రజాక్ ఘన సత్కారం**



**యాడికి మార్చి 18 :-** యాడికి మండలం సమాజానికి తమ వంతు సేవ చేయాలన్న తలంపు అభినందనీయమని పీపుల్స్ హ్యూమన్ రైట్స్ జిల్లా సెక్రెటరీ గుండా నారాయణస్వామి అన్నారు. మంగళవారం ప్రపంచ సామాజిక సేవ దినోత్సవ సందర్భంగా యాడికి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు,జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి సామాజికవేత్త సేవకుడు జూటూరు అబ్దుల్ రజాక్ ను పీపుల్స్ హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ నాగేంద్ర ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ సూచనలతో పీపుల్స్ హ్యూమన్ రైట్స్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఖాదీ మాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు .ఈ సందర్భంగా గుండా నారాయణ స్వామి మాట్లాడుతూ సమాజంలో విభిన్న అవసరాలున్న ప్రజలను గుర్తించి వారికి స్వచ్ఛంద సంస్థలు అండగా నిలుస్తుండటం హర్షనీయమన్నారు. ఇలాంటి సేవలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీపుల్ సీమన్ రైట్స్ జాయింట్ సెక్రటరీ కుండా లక్ష్మీనారాయణ, తాడిపత్రి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మార్కె మురళి,సెక్రెటరీ చింతా తిరుమలేష్,జాయింట్ సెక్రటరీ మూలింటి శివప్రసాద్, లింగం చంద్రశేఖర్, గుండా ఓబులేషు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపండి



**ఆళ్లగడ్డ మార్చి 18 :-** ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మండలం లోని తిమ్మనపల్లె, హరినగరం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాలను జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి జిల్లా వ్యవసాయ ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వినియోగం రోజురోజుకు ఎక్కువ అవుతున్నందువలన ఎరువుల వినియోగాన్ని తగ్గించే దిశగా రైతులు వివిధ కార్యక్రమాలలో పాల్గొని వ్యవసాయ అధికారులు చెప్పే సూచనలు పాటించాలన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు, అలాగే సొంత భూమి కలిగిన ప్రతి ఒక రైతు, రైతు విశిష్ట గుర్తింపు నెంబర్ కొరకు రైతు సేవ కేంద్రాలకు వెళ్లి నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎ పి సి ఎన్ ఎఫ్ జిల్లా అధికారి నరేంద్రా రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో సుస్థిర దిగుబడులు సాధించుటకు గాను ప్రకృతి వ్యవసాయమే మార్గం అని సూచించారు. నేల ఆరోగ్యంతో పాటు పంటల ఆరోగ్యం అలాగే ప్రజల ఆరోగ్యం కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు, ప్రతి రైతు తనకున్న పొలంలో కొంత భాగమైన ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించుటకు ముందుకు రావాలని తెలిపారు. ఉత్సాహవంతమైన వారికి తగిన శిక్షణ కూడా ఇస్తామని తెలిపారు. అనంతరం ఆళ్లగడ్డ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని చాలామంది రైతులు విత్తనోత్పత్తి కొరకు పంటలు పండించటము అన్నది చాలా సంతోషదాయకమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేసి మిగిలిన గ్రామ రైతులందరికీ ఆదర్శంగా నిలవాలని ఆయన తెలిపారు. రుద్రవరం మండల వ్యవసాయ అధికారి సుమతి, విస్తరణ అధికారులు రాజు, ఫహీమా తబస్సుమ్, రైతు సేవ కేంద్రాల సిబ్బంది పవిత్ర, గ్రామల రైతులు పాల్గొన్నారు.

# టిటిడికి రూ.1.23 కోట్లు విరాళం



**తిరుమల మార్చి 18:-** టిటిడికి చెందిన శ్రీ ఎస్వీ అన్నదానం, శ్రీ ఎస్వీ ప్రాణదానం, శ్రీ ఎస్వీ విద్యాదానం విభాగాలకు మంగళవారం రూ.1.23 కోట్లు విరాళం అందింది. కర్నాటక రాష్ట్రం బళ్ళారికి చెందిన శ్రీ శ్రీనివాస కన్స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఈ మేరకు డిడిలను తిరుమలలోని క్యాంపు కార్యాలయంలోటిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి కి అందజేశారు. విరాళం వివరాలు ఇలా ఉన్నాయి. రూ. 1,01,11,111 విరాళాన్ని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్ కు, రూ.11,11,111 విరాళాన్ని ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్ కు, రూ. 11,11,111 విరాళాన్ని ఎస్వీ విద్యాదానం ట్రస్ట్ కు సదరు సంస్థ ప్రతినిధులు డిడిలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి అభినందించి సత్కరించారు.

# టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



**తిరుమల మార్చి18:-** తిరుపతికి చెందిన కేవస్సీ టాకీస్ చైర్మన్ కేతన్ శివ ప్రీతమ్ టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు మంగళవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు.ఈ మేరకు విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి తిరుమలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా దాతను అదనపు ఈవో అభినందించారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

# గీతాంజలి రమణకు టిడిపి నేతలు సత్కారం

**రాజంపేట మార్చి 18:-** ఉమ్మడి కడప జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా రాజంపేట గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగ వాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పలువురు టిడిపి నేతలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు ఈ సందర్భంగా సుగవాసి మాట్లాడుతూ ఎస్వీ రమణ విద్యా సంస్థల పరంగా కాకుండా రాజకీయంగాను ఇంకా ఉన్నతమైన పదవులు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయ, మండలం మాజీ మండల పార్టీ అధ్యక్షులు కొండయ్య, ఆర్.ఎం.పి డాక్టర్ తోటరామయ్య, మేకా నర్సింహులు ,షామీర్ భాష రవికుమార్,అంజిబాబు వెంకటరాముడు,సుధాకర్ వరదయ్య, కె.ఎస్ నరసింహ, అగ్రహారం సుధాకర్, సూరి,రమేష్, చెన్నయ్య, జనసేన నాయకులకు గోపాల్ రమణ నాయుడు,చంద్రయ్య నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.



# మార్చి 25న కోయిల్ అల్వార్ తిరుమంజనం, 30న ఉగాది ఆస్థానం

**● విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు**



**తిరుమల మార్చి 18:-** ఈనెల 30వ తారీఖున విశ్వావసు నామ సంవత్సర తెలుగు ఉగాదిని పురస్కరించుకుని, టీటీడీ శ్రీవారి ఆలయంలో మార్చి 25వ తారీఖున కోయిల్ ఆల్వార్ తిరుమంజనం నిర్వహించనుంది. ఈ కారణంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన సేవను టిటిడి రద్దు చేసింది.అదే విధంగా, మార్చి 30 ఆదివారం నాడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని, సహస్ర దీపాలంకార సేవ మినహా అన్ని ఆర్జిత సేవలను రద్దు చేయడమైనది. మార్చి 25 మరియు 30 తేదీలలో ప్రోటోకాల్ పరిధిలోని విఐపి లకు మాత్రమే విఐపి బ్రేక్ దర్శనాలు ఉంటాయి. ఈ కారణంగా మార్చి 24వ తారీఖున, అదే విధంగా మార్చి 29న విఐపి బ్రేక్ దర్శనాలకి సంబంధించి ఎటువంటి సిఫార్సు లేఖలను స్వీకరించడం జరగదు. ఈ అంశాలని భక్తులు దృష్టిలో ఉంచుకొని టీటీడీకి సహకరించవలసిందిగా కోరడమైనది.

# భవన నిర్మాణ కార్మికుల చలో ఢిల్లీ పోస్టర్లు విడుదల



**రాజంపేట మార్చి 18:-** భవన నిర్మాణ కార్మికుల సమస్యల పై ఈనెల 28వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను ఈరోజు రాజంపేట ఆర్ఎంపీ బంగ్లా వద్ద భవన నిర్మాణ కార్మిక జిల్లా అధ్యక్షులు గాలి చంద్రయ్య ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్లు పోస్టులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న ఢిల్లీ పార్లమెంటు ఎదుట చేపట్టిన మహా ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని భావన నిర్మాణ కార్మికులందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు వై నరసింహ. నన్నే సాహెబ్. మహమ్మద్ హుస్సేన్. పి జై రామ్. వెంకటస్వామి. నాగభూషణము. వెంకప్ప. జి శ్రీనివాసు. ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి, బోయలను ఎస్టీల్లో చేర్చండి

**● ప్రభుత్వ విప్ కాలవ ఆధ్వర్యంలో**

**ముఖ్యమంత్రిని కలిసిన ప్రజాప్రతినిధుల బృందం**



**బొమ్మనహల్ మార్చి 18:** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన వాల్మీకి, బోయలను షెడ్యూల్ తెగల్లో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వాల్మీకి సామాజికవర్గ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ల బృందం విన్నవించింది. భావితరాల భవిషత్ ను దృష్టిలో ఉంచుకొని కేంద్రానికి త్వరగా సానుకూల నివేదిక అందించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు గుమ్మనురు జయరాం, పార్ధసారథి, ఎమ్మెల్సీ బి టి నాయుడులు మంగళవారం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి ఛాంబరులో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని వాల్మీకి, బోయలు సామాజికంగా, ఆర్థికంగా చాలా వెనుకపడ్డారని గుర్తు చేశారు. ఆరు దశాబ్దాలకు పైగా తమ న్యాయమైన సమస్యకు పరిష్కారం లభించలేదని తెలియచేశారు. ఎన్డీయే కూటమి బలపర్చుతున్న ప్రభుత్వమే కేంద్రంలోనూ అధికారంలో ఉన్నందున మీ మీదే సామాజికవర్గ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చంద్రబాబుకు వివరించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఈ అంశంపై రాష్ట్ర శాసనసభ, శాసన మండలిలో సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ.లుగా గుర్తించాలని ఏకగ్రీవ తీర్మానాన్ని కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ప్రొఫెసర్ సత్యపాల్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని నియమించారని వివరించారు. సదరు కమిటీ సిఫార్సు మేరకు మీ ఆధ్వర్యంలో 2017లో కేంద్రానికి సానుకూల నివేదిక పంపిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నివేదికలో ప్రత్యేకంగా ఆరు అంశాలపై మాత్రం వివరణ కోరుతూ కేంద్ర జనగణన విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రాష్ట్రానికి లేఖ పంపారని పేర్కొన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కావాలనే ఈ అంశాన్ని వివాదంలోకి లాగి విభజన రాజకీయాల చిచ్చు రేపిందని తెలిపారు. కేవలం రాయలసీమ ప్రాంతానికి చెందిన బోయ, వాల్మీకులనే ఎస్టీ జాబితాలో చేర్చాలని నివేదించడంతో ప్రాంతాల మధ్య గొడవలు సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూశారన్నారు,ఆంధ్రకు పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో వాల్మీకి, బోయలను ఎస్టీలుగా గుర్తించారన్నారు.బంధుత్వాలు, ఆచారాలతో పాటు సామాజికంగా, ఆర్థికంగా ఒకే విధమైన ప్రమాణాలతో జీవిస్తున్న వారిని ఆ రాష్ట్రం ఎస్టీలుగా గుర్తించగా, మన రాష్ట్రంలో మాత్రం సమస్య పరిష్కారంకాలేదని తెలిపారు, గతంలో ఇలాంటి అనేక వివాదాలు తలెత్తినప్పటికి 2017లో ముఖ్యమంత్రి గా మీరు అందరికి న్యాయం జరగాలని లక్ష్యంతో ఎస్టీల్లో చేర్చాలనే రాష్ట్ర కేబినెట్ ద్వారా సిఫార్సు చేయించారని గుర్తు చేశారు. అదే అభిప్రాయానికి మన ప్రభుత్వం కట్టుబడిందనే విషయాన్ని గుర్తుచేస్తూ మరో సారి పునరుద్ధరణ నివేదిక కేంద్రానికి పంపాలని అభ్యర్థించారు. రాష్ట్రంలోని వాల్మీకి, బోయలు మీపై పెట్టుకొన్న నమ్మకాన్ని, విశ్వాసానికి సానుకూల స్పందన ఆశిస్తున్నామని విజ్ఞప్తి చేశారు. కేంద్రం కోరిన ఆరు అంశాలపై త్వరగా సమగ్ర సానుకూల నివేదిక పంపాలని కోరారు. అలాగే ప్రస్తుతం కేంద్రంలో కూటమి ప్రభుత్వంలో మీకున్న పలుకుబడితో తమ సమస్య త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.

# చలివేంద్రం ఏర్పాటు




**తొండూరు మార్చి 18:-** మండల పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది . ఈరోజు స్వాతి నక్షత్రం కావడంతో ఆలయ సభ్యులు భక్తుల ఆధ్వర్యంలో ఎస్ ఐ పెద్ద ఓబన్న చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి నవ నరసింహస్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని విశేష పూజలు నిర్వహించి కాయ కర్పూరంతో పూజలు నిర్వహించుకున్నారు. గుడికి వచ్చిన భక్తాదులకు స్వాతి నక్షత్రం కావడముతో అన్నదానం నిర్వహించి చలివేంద్రము ఏర్పాటు చేయడం కూడా జరిగింది. పోలీస్ సిబ్బంది ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

**- మార్గదర్శకాలు విడుదల**

**ఉరవకొండ మార్చి 18 :-** 15వ ఆర్థిక సంఘం నిధులు స్థానిక సంస్థలకు కేటాయింపులు మార్గదర్శకాలు ఈరోజు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.70 : 20 : 10 నిష్పత్తి ప్రాతిపదికన నిధులు కేటాయింపు.గ్రామ పంచాయతీలకు 70%, మండల పరిషత్ లకు 20%, జిల్లా పరిషత్ లకు 10% నిధులు కేటాయింపు.గ్రామ పంచాయతీల్లో జనాభా శాతం ఆధారంగా నిధులు విడుదల.

# 60 కిలోమీటర్ల వరకు టోల్గేట్ రుసుము చెల్లించొద్దు

**- కేంద్ర ప్రభుత్వ ఆదేశం**

**ఉరవకొండ మార్చి 18 :-** మీ ఇంటి నుండి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏ టోల్ గేట్ వద్ద టోల్ గేట్ రుసుము చెల్లించ వద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.మీ ఆధార్ కార్డ్ చూపిస్తే చాలు ఫ్రీగా టోల్ ప్లాజా దాటోచ్చని పేర్కొంది.ఇది కేంద్ర ప్రభుత్వ ఆదేశమని ఎట్టి పరిస్థితుల్లో ఆదేశాలు విళంబించవద్దని పేర్కొంది.

# టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ కార్డులు అందజేత



**యాడికి మార్చి 18:-** యాడికి మండలం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గత రెండు మాసాల క్రితం సభ్యత్వం చేయించుకున్న వారి కార్డులు, బ్యాడ్జీలు (తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులు) ఆయా వార్డుల బూతు ఏజెంట్లకు, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాలతో అందజేసినట్లు టీడీపీ మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాద బీమా రూ. 4 లక్షలు వర్తిస్తుందని, సభ్యత్వ నమోదు ఆన్ లైన్ లో చేసుకోవడానికి మరో రెండు నెలల గడువు పొడిగించినట్లు రుద్రమ నాయుడు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరు తున్నారు. తాంద్ర విక్రమ్, నరసింహ చౌదరి, సెల్ పాయింట్ చాంద్ బాషా, బూత్ కన్వీనర్ గోపి, తెల్లాకుల విశ్వనాథ్, తెల్లాకుల చలపతి, ఫైబర్ చందు, తెల్లాకుల వెంకటేష్, తెల్లాకుల వాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# సిఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి మార్చి 18:-** నగరానికి చెందిన ముగ్గరికి సిఎం ఆర్ ఎఫ్ చెక్కుల్ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో అందచేశారు. ఎర్రమిట్టకు చెందిన ఆళ్ల రాజ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈయనకు ఏడు లక్షల రూపాయలు మంజూరు కాగా ఆళ్ల రాజ సతీమణి సుగణకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెక్ అందించారు. అలాగే ఆటోనగర్ కు చెందిన కిరణ్ కుమార్ లివర్ క్యాన్సర్ తో బాధపడుతుండగా ఆయనకు రెండు లక్షలా ఐదు వేల రూపాయలు మంజూరు కాగా ఆయనకు చెక్కును ఎమ్మెల్యే అందచేశారు. అలాగే శ్రావణ్ కుమార్ కు యాభై ఆరు వేలు చెక్కును ఎమ్మెల్యే అందించారు.ఎన్డీఎ నాయకులు మహేష్ యాదవ్, బాబ్జీ, సాయి, రూపేష్ రాయల్ పాల్గొన్నారు.

# ఉపాధి పనులను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో

**వేముల మార్చి 18:-** వేముల మండల పరిధిలోని స్థానిక వేముల గ్రామ సమీపంలో చేస్తున్న ఉపాధి పనులను మంగళవారం ఉదయం స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి లు పరిశీలించారు. అందులో భాగంగా హాజరైనటువంటి ఉపాధి సిబ్బంది కి సంబంధించిన మస్టర్లను మరియు వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ మధుసూదన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రామాంజి నాయక్ , ఫీల్డ్ అసిస్టెంట్ మరియు ఉపాధి కార్మిక పాల్గొన్నారు.



# సమస్యలపై స్పష్టత లేని విపక్షాలు !




పార్లమెంట్ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చ సాగడం లేదు. ఈ విషయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఘోరంగా విఫలం అవుతోంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చకు తేవడం లో ఆ పార్టీ గత కొంత కాలంగా పార్లమెంటులో విఫలం అవుతోంది. ఎంతసేపు కేవలం బిజెపిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోందే తప్ప..సమస్యలను ఆధారంగా చేసుకుని బిజెపిని విమర్శలు చేయడం లేదు. పార్లమెంట్ ఇప్పుడు కాంగ్రెస్, బిజెపిల మధ్య వ్యక్తిగత ఎజెండాగా మారింది. మిగతా విపక్షాలు కూడా అలాగే ఉన్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో గతంలో చక్కటి చర్చ జరిగేది. ప్రభుత్వం కూడా చర్చలకు అవకాశం ఇచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. సాదాసీదాగా పార్లమెంట్ సమావేశాలు సాగుతు న్నాయి. ఏ పార్టీ ఎజెండా దానికి ఉంది. దాని ప్రాకరమే సాగుతున్నారు. డిఎంకె హిందీవ్యతిరేకత, డీలిమిటేషన్‌పై పోరాడుతోంది. ఆ అంశాలను ప్రస్తావించి హడావిడి చేసింది. విలువలతో కూడాని రాజకీయాలు నెరిపే బిజెపికి ఇప్పుడు అసత్యాలు మాట్లడడమే అలవాటుగా చేసుకుంది. ఈ పార్టీలో అన్నీ అవలక్షణాలు చోటుచేసుకున్నాయి. కేవలం ఇద్దరి చేతుల్లోనే పార్టీ ఉంది. వారిద్దరే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. కార్పోరేట్ల సలహాలతో వారు చెప్పిన రీతిలోనే పాలన సాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాము చెప్పిందే వేదం అన్న రీతిలో పార్టీని నడుపుతూ పోతున్నారు. అన్నీ ఘనతలు సాధించామని, భారత్ ఉజ్వలంగా ఉందని గొప్పలకు పోతున్నారు. ఇలాంటి వారికి ఎదుటి వారు చెప్పే నిజాలు చేదుమాత్రగానే ఉంటుంది. దేశంలో నిరుద్యోగం గరిష్ఠానికి చేరింది. సమస్యలపై గొంతుచించుకుని అరిచినా వినిపించుకునే స్థాయిని మోడీ దాటిపోయారు. నిరుద్యోగం పెరిగిందని, ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీస్తున్నా సమాధానం ఇచ్చే ధైర్యం మోడీకి లేదు. విపక్ష పార్టీలు నిజాలు అడిగినంతనే బిజెపి అగ్గిమీద గుగ్గిలం కావడం దాని అసహనాన్ని వెల్లడిస్తోంది. ఉద్యోగ కల్పనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విఫలమయ్యారని గణాంకాలే వెల్లడిస్తున్నా ఒప్పుకునే ధైర్యం చేయడం లేదు. దీనికితోడు ఉన్నప్రభుత్వరంగ సంస్థలను నిస్సిగ్గుగా అమ్ముతున్నా..గట్టిగా నిలదీసే నేతలు బిజెపిలో కూడా లేరు. అంతెందుకు పార్లమెంటులో ఏ సమస్యపైనా చర్చించే ధైర్యం కూడా మోడీ చేయడం లేదు. అసలు తమను పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్ని వర్గాలు వాదిస్తున్నా పట్టించు కోవడం లేదు. ఎన్నికల ముందు, పార్లమెంటు సమావేశాల సందర్భంగా నీతి వాక్యాలు చెప్పడంతప్ప సమస్యల కోణంలో చూడడం లేదు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఏయే రంగాల్లో ఎలాంటి సానుకూల మార్పులు తీసుకు వచ్చిందీ చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసు కోవడం లేదు. రాష్ట్రాలకు ఒరగబెట్టిందీ ఏమీ లేకున్నా గణాంకాలతో వివరించేందుకు పదేపదే ప్రయత్నాలు చేయడంతప్ప మరేమీ లేదు. యోడీ తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బ తీసింది. చాయ్ అమ్మానని గొప్పుల చెప్పే ప్రధాని మోడీ,గ్రామాల్లో చాయ్ అమ్మేవాళ్లకు కూడా కష్టకాలం తీసుకుని వచ్చారు. ఎంతోమంది ఆర్థిక వేత్తలు, ఆర్థిక నిపుణులు జిఎస్‌టి వల్ల కలిగిన విపరిణామాలను ఏకరువు పెట్టినా పట్టించుకోలేదు. పలు స్వతంత్ర నివేదికలు ఇప్పటికే ఈ విషయాన్ని కుండబద్దలు కొట్టాయి. నిజానికి ఇది ప్రతి నిరుద్యోగి చేస్తున్న ఆక్రందన. దేశంలో ఉద్యోగాలు రావు. వస్తూత్పత్తి పెరిగినా అనుబంధ రంగాలు బలపడలేదు. వ్యవసాయం దివాళా తీసింది. పండించిన పంటలకు మద్దతు ధరలు రావడం లేదు. పండించిన పంటలను అమ్ముకునే పరిస్థితి లేదు. బలమైన మార్కెటింగ్ వ్యవస్థ లేకుండా పోయింది. ఇందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పత్తి, మిర్చి, పసుపు,వరి పండించిన రైతులే నిదర్శనం. వ్యవసాయానుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించి ఉంటే నిరుద్యోగాన్ని తగ్గించుకునే అవకాశం ఉంది. ఉద్యోగాలు కల్పిస్తానని, మేకిన్ ఇండియా అంటూ ఊదరగొట్టడం తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ సమస్య తీర్చే ప్రయత్నాలు జరిగివుంటే పరిస్థితి ఎందుకింత దారుణంగా ఉంటుంది. దీనికితోడు రూపాయి విలువ పడిపోతూ, ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతుందే తప్ప అభివృద్ధి గణాంకాలు ముందుకు సాగడం లేదు. పాలనలో కొత్త ఒరవడి తీసుకుని వచ్చి,ప్రజలకు ఆసరాగా అండగా, దేశానికి మంచి చేసేలా చేస్తారని మోడీని నమ్మిన ప్రజలు ఇప్పుడు చేష్టలు ఉడిగి చూస్తున్నారు. దీనిపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శ చేసుకుంటే పార్టీకి, దేశానికి మంచిది. దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు ఎలా సన్నగిల్లాయో లెక్కలుచూస్తే తెలుస్తుంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 7.8శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3శాతం చొప్పున నిరుద్యోగిత ఉందని, సగటున 6శాతం పైనేనని గణాంకాలు తెలుపుతున్నాయి. తీవ్రమైన ఉపాధి లేమి కారణంగా మొన్నటి ఎన్నికల్లో మోదీ విజయావకాశాలను దెబ్బతీసిందని చాలా మంది అంచనాలు వేశారు. అయితే మోడీ మేనేజ్‌మెంట్‌తో ఎన్నికల్లో గెలవడంతో ఇక తమకు తిరుగులేదన్న ధోరణిలో ఉన్నారు. స్వతంత్ర సంస్థల నోరుకట్టేసి, ప్రభుత్వ సంస్థల నివేదికలను దాచేసి, ఎన్నో అద్భుతాలను సాధించామని చెప్పుకున్నంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకోవడం అవివేకం. అధికారంలోకి వచ్చేముందు కోట్లాది ఉద్యోగ ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలం అవే మాటలతో మేకిన్ ఇండియా పాట కూడా పాడారు. నిజంగానే ఇదే సాకారం కావాలంటే స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాలి. పంటల కొనుగోలుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పడాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. చైనా ఈ రకమైన విజయాలతోనే ఆర్థికంగా విజయం సాధించిందని వేరుగా చెప్పనక్కరలేదు.



# ఉనికిని కోల్పోతున్న బిఎస్పీ

- ఆత్మపరిశీలనచేసుకోని మాయావతి
- బిజెపిలో బిసిలకు పెరుగుతున్న ఆదరణ

**న్యూఢిల్లీ,మార్చి18:** ఒకప్పుడు యూపీ రాజకీయాలను శాసించిన బీఎస్పీ నామావశిష్టంగా మారిపోవడం విషాదం. బడుగు వర్గాలకు అండగా నిలిచిన పార్టీ మట్టి కరచి పోవడం దేశంలో బడుగులకు గొడుగు లేకుండా పోయింది. దీనికితోడు మాయావతి నాయకత్వం కూడా ప్రభావవంతంగా లేదు. ఇలాంటి సందర్భంలో ఇప్పుడు అన్ని పార్టీలు బిసి జపం చేస్తున్నాయి. ఒకప్పుడు యూపిని ఏలడంతో పాటు, బడుగులకు ఆశాజ్యోతిగా ఉన్న బిఎస్పీ ఇప్పుడు ఉనికి కోల్పోవడం చూస్తుంటే..బడుగులకు కూడా ఆశలు సన్నగిల్లాయా అన్న అనుమానాలు వస్తున్నారు. అంతేగగాకుండా యూపిలో అధికార పీఠానికి దూరంగానే మిగిలిపోయింది. సంక్లిష్ట కుల, ప్రాంత సమీకరణలతో బహుముఖ పోటీ ఉండే యూపీ లాంటి రాష్ట్రం కేవలం బీజేపీ, ఎస్పీల ద్విముఖ పోరుగా మారిపోవడం గమనించాలి. ఈ పోరుతో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో పాటు కాంగ్రెస్ కూడా నలిగిపోయింది. దశాబ్దాలుగా లేని విధంగా యూపీలో అధికార పక్షాన్నే రెండోసారి పీఠమెక్కించాయి. గతంలో బిజెపి మద్దతుతో లేదా ఎస్పీ మద్దతుతో అధికారం నడిపిన మాయావతి ఎందుకనో నిస్తేజంగగా మారారు. తాజా రాజకీయాల్లో నామమాత్ర పాత్రకే పరిమితం అయ్యారు. బిఎస్పీ తన పూర్వ ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయింది. ఓటు బ్యాంకును కూడా కోల్పోవడం మాయావతి నాయకత్వ వైఫల్యం తప్ప మరోటి కాదు. కాన్షీరామ్ లాంటి బలమైన నేత ఇప్పుడు బిఎస్పీకి రావాలి. బడుగు బలహీనవర్గాలకు అండగా ఉన్నారన్న ప్రభావం చూపాలి. ధరల పెరుగుదల, ఉపాధి లేమి, రైతు ఉద్యమాలు, మధ్యతరగతి కష్టాలు, అధికారపక్షానికి సాధారణంగా ఎదురయ్యే వ్యతిరేకత లాంటివేవీ బీజేపీ గెలుపును ఆపలేక పోయాయి. భావోద్వేగాలను ప్రేరేపించే అంశాలే ఎన్నికల్లో ప్రతిఫలిస్తున్నాయి. నిజానికి బిఎస్పీ, కాంగ్రెస్ పార్టీల్లోనే బడుగు బలహీన వర్గగాలకు పెద్దపీట దక్కుతుంది. అలాంటిది ఈ రెండు పార్టీలు ఈ ఎన్నికలతో తమ మూలాలను కోల్పోయాయి. బీజేపీ, మోదీ ప్రభంజనాలకు ఇప్పటికైతే తిరుగులేదనే భావనను కలిగించాయి .విభిన్న సమీకరణాల ఎన్నికల రాజకీయాల నిర్వహణలో ప్రస్తుతం దేశంలో మరే పార్టీ దానికి పోటీలో లేవని నిరూపితం అయ్యింది. దీనికితోడు బిజెపిలో ఇప్పుడు బిసిలు,ఎస్సీలకుకూడా తగు ప్రాధాన్యత దక్కుతోంది. కులాల గురించి పోరాడుతున్న వారు సైతం బిజెపి గొడుగుకిందకు చేరుతున్నారు. ఈ ఫలితాలతో బిఎస్పీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిజానికి బిఎస్పీలో కూడా మాయావతి తిరుగేలని నియంతలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ రకంగా చెప్పాలంటే బిఎస్పీ, కాంగ్రెస్ ఓటు బ్యాంక్ బిజెపికి మళ్లుతోందని గుర్తించాలి. అదే సందర్భంలో పర్మినెంట్ ఓటు బ్యాంక్ కూడా ఇక ఉండబోదన్న సంకేతాలను గుర్తించాలి. కొత్త ఓటర్ల రాక,యువత ఆలోచనలు మారడం లాంటివి కూడా సంప్రదాయ ఓటుబ్యాంక్‌ను దెబ్బతీస్తున్నాయి. మోదీ పాపులారిటీకి యువత ఆకర్శితులు అవుతున్నారు. ఒక రకంగా ఇది కాంగ్రెస్‌కు,బిఎస్పీలకు మేలుకొలుపు లాంటిది. ఇప్పటికైనా నాయకత్వ లోపాలను సరిదిద్దుకోకపోతే కాంగ్రెస్‌కు భవిష్యత్తు కష్టమే. ఒక్క కాంగ్రెస్‌కే కాదు... ఇతర ప్రతిపక్షాలకూ తాజా రాకీయపరినామాలు పాఠం నేర్పాయి.

## ప్రేమ మధురమైన అనుభూతి ! ( ఆధ్యాత్మిక చింతన )

**తిరుమల,మార్చి18:** భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ భాగవతం విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి ఉండాలని కోరుకుంటాడు. భక్తితో తనను శరుణు వేడుకున్న వారికి అండగా ఉంటానని చెబుతాడు. మన పురాణాలు, ఉపనిశత్తులు, అన్నీ ఇదే చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి. మనసు మరే ఇతర విషయాల మీద, ఇతర దేవతా రూపాల మీద కాకుండా... ఆ ఇష్టదేవతామూర్తి పైనే నిరంతరం లగ్నం కావాలి. ఇందులో ఏ దేవుడు గొప్ప అన్నది లేదు. అంతా సమానమే. అంతేకాని విష్ణువు, శివుడు వేరని మాత్రం కాదు.

# ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత



- అప్పడే ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి

**నిజామాబాద్,మార్చి18:** ఉత్తర తెలంగాణలో మళ్లీ ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గత రెండుమూడు రోజలులుగా ఎండవేడిమికి తోడు ఉక్కపోతలు మొదలయ్యాయి. ఇన్నాళ్లూ చలితో వణికిపోయిన ప్రజలు తాజాగా ముదురుతున్న ఎండలు చెమటలు పట్టిస్తున్నాయి. జిల్లాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే జనాలు రోడ్లపైకి వస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు రావడంలేదు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఉక్కపోత ఎక్కు వైంది. మధ్యాహ్నం సమయంలో ఇళ్లల్లో ఉండడమే కష్టమవుతోంది. ఎప్పుడూ ఏప్రిల్ నెలలో ఎండల తీవ్రత పెరిగేది. కానీ ఈసారి ముందుగానే ఎండలు మొదలయ్యాయి. ఉత్తర తెలంగాణలో నిజామబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎండల తీవ్రత అప్పుడే పెరిగింది. గరిష్ఠం 38 డిగ్రీలుగా నమోదు అవుతోంది. ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైతే రాబోయే ఏప్రిల్, మేలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తి పోతున్నారు. వేసవి సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారాలు ఊపందుకుంటున్నాయి. ఇప్పటికే శీతల పానియాల కేంద్రాలు సిద్ధమవుతుండడంతో కూలర్‌ల తయారీలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. ఎండల తీవ్రతకు ముందే ముందస్తుగా కూలర్లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సీజన్ ఊపందుకుంటే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్య వ్యాపార కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వేసవి సీజన్‌లో జ్యూస్ వ్యాపారం పెరిగింది. ఎండలు మండుతుండడంతో.. ద్రాక్ష, పైనాఫిల్, అరటి, బత్తాయి, సపోట, పుచ్చకాయ,నిమ్మ, ఆపిల్ పండ్లకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. చెరకు, లస్సీ, మజ్జిగ, మామిడి, మిక్స్‌డ్ ఫ్రూట్స్ లాంటి పలు రకాల పానీయాల జ్యూస్ సెంటర్లలో లభిస్తున్నాయి.

# ఐపీఎల్ మ్యాచ్ వీక్షకులకు బంపర్ బొనాంజా

- వీక్షకులకు ఉచిత మెట్రో రైలు రవాణా
- చెన్నై మెట్రో శాఖ కీలక నిర్ణయం

క్రికెట్ ప్రపంచంలో ఉర్రూతలూగించే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభానికి సిద్ధమైంది. కొన్ని గంటల్లో ఈ మహా క్రీడా సంగ్రామం ప్రారంభం కానుండగా.. మ్యాచ్ వీక్షించే అభిమానులకు బంపర్ బొనాంజా తగిలింది. క్రికెట్ ప్రియులు అతికష్టంగా సంపాదించిన ఐపీఎల్ మ్యాచ్‌కు సంబంధించి చెన్నై మెట్రో శాఖ బంపర్ ఆఫర్ ప్రకటించింది. మ్యాచ్ చూసే ప్రజలందరికీ ఉచిత మెట్రో రైలు రవాణా కల్పిస్తున్నట్లు శుభవార్త వెల్లడించింది. క్రికెట్ మ్యాచ్‌లు చూసే ప్రతి ప్రేక్షకుడికి ఉచితంగా మెట్రో రైలు రవాణా కల్పిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.తమిళనాడు తరఫున ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. విజిల్ పోడు అంటూ ఎల్లో ఆర్మీ ఐపీఎల్‌లో రచ్చ చేస్తోంది. ఎల్లో ఆర్మీకి తమిళనాడు వ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. మరి అలాంటి చెన్నై సూపర్ కింగ్స్ తమపై ఆదరభిమానులు చూపిస్తున్న ప్రేక్షకులకు అదిరిపోయే కానుక అందించింది. మ్యాచ్‌లకు వచ్చే ప్రతి ప్రేక్షకుడికి ఉచిత మెట్రో రైలు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. ఐపీఎల్ సీజన్‌లో ప్రయాణికులందరికీ చెన్నైలో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తూ మెట్రో సంస్థ ప్రకటించింది. క్రికెట్ మ్యాచ్‌లు చూసే ప్రతి వీక్షకుడికి చెన్నై సూపర్ కింగ్స్‌తో చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఐపీఎల్‌లో జరిగే ప్రతి మ్యాచ్ కు వెళ్లే ప్రేక్షకుడికి ఉచిత ప్రయాణం అందించనున్నట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. మెట్రో స్టేషన్ నుంచి గవర్నర్‌మెంట్ ఎస్టేట్




వరకూ రాను పోను మెట్రో రైలు సేవలు క్రికెట్ వీక్షకులు ఉచితంగా వినియోగించుకోవచ్చు.ఉచిత ప్రయాణ సదుపాయానికి సంబంధించిన కొన్ని నిబంధనలు విడుదల చేసింది. మ్యాచ్‌లు ఉన్న రోజులు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. మెట్రో రైలు సేవలు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. మ్యాచ్ జరిగిన రోజు అర్ధరాత్రి ఒంటి గంట వరకూ మెట్రో సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి మెట్రో రైలు సేవల వేళలను చెన్నై మెట్రో సంస్థ ప్రకటించనుంది.

# ధోనీ చాలా ఫిట్‌గా కనిపిస్తున్నాడు

- బౌలర్లందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నాడు
- ధోని కంటే గొప్పోడిని నేను చూడలేదు
- ధోనీపై హర్భజన్ ప్రశంసల వర్షం

టీమ్ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్?కు గుడ్?బై చెప్పినా ఐపీఎల్‌లో మాత్రం కొనసాగుతున్నాడు. 43 ఏళ్ల వయసులోనూ అద్భుతమైన ఫిట్?నెస్?తో ఐపీఎల్?లో ఫ్యాన్స్?ను అలరిస్తున్నాడు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2025 సీజన్ కోసం మహీ ఫిబ్రవరిలోనే చెన్నైకి చేరుకొని రెగ్యులర్?గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. అయితే ఇటీవలే టీమ్?ఇండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, ధోనీ ఓ వివాహ వేడుకలో కలుసుకున్నారు. ఈ క్రమంలో ధోనీతో జరిగిన సంభాషణ గురించి భజ్జీ తెలిపాడు. తాను ఇటీవలే ధోనీని ఓ ఫ్రెండ్ కుమార్తె వివాహ వేడుకలో కలిశానని హర్భజన్ సింగ్ వెల్లడించాడు. అప్పుడు ధోనీ చాలా ఫిట్‌గా, దృఢంగా కనిపించాడని చెప్పాడు. "ఈ వయసులో ఏం చేస్తున్నావు (ఫిట్‌నెస్‌ను ఉద్దేశించి), కష్టమే కదా' అని అన్నాను. 'అవును ఈ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం కష్టమే. కానీ, నేను చేయాలనుకుంటున్నది ఇదే. నేను దానిలో ఆనందాన్ని పొందుతాను. ఫిట్‌గా ఉంటూ ఆటను కొనసాగించాలనుకుంటున్నా" అని ధోనీ బదులిచ్చినట్లు హర్భజన్ సింగ్? చెప్పాడు.ఏడాది పొడవునా ఎలాంటి క్రికెట్ ఆడకుండా ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం అనేది చాలా కష్టమేనని భజ్జీ వ్యాఖ్యానించాడు. కానీ, అది ఎలా సాధ్యమో ధోనీ చేసి చూపిస్తున్నాడని కొనియాడాడు. దోనీ ఇతరుల కంటే మెరుగ్గా ఏదో చేస్తున్నాడని, నామమాత్రంగా జట్టులో కొనసాగడం లేదన్నాడు. తన బ్యాటింగ్‌తో ధోనీ బౌలర్లందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నాడని పేర్కొన్నాడు. "ఒకట్రెండు నెలలుగా ధోనీ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఎన్ని ఎక్కువ బంతులు ఆడితే ఆ స్థాయిలో సిక్సర్లు వస్తాయి. ధోనీ చెన్నైలో ప్రతిరోజూ 2-3 గంటలు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇంత వయసులో కూడా గ్రౌండ్‌కి



మొదటగా వచ్చి అందరికంటే ఆఖరిగా వెళ్లే వ్యక్తి ప్లేయర్ దోనీనే. అదే ధోనీకి, ఇతర క్రికెటర్లకు ఉన్న తేడా. వికెట్ కీపింగ్‌లోనూ ధోనీని మించినవారిని నేను చూడలేదు. " అని ధోనీపై హర్భజన్ ప్రశంసలు కురిపించాడు.కాగా, ఐపీఎల్ 18వ ఎడిషన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలు ప్రాక్టీస్ ను ముమ్మరంగా చేశాయి. ఈ సీజన్‌లో సీఎస్కే తన తొలి మ్యాచ్ ముంబయి ఇండియన్స్‌తో తలపడనుంది. మార్చి 23న చెపాక్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.

# పృథ్వీ షాకు చాలా కష్టకాలం నడుస్తోంది

- షా చాలా అండర్ రేటెడ్ క్రికెటర్: శశాంక్ సింగ్ కీలక వ్యాఖ్యలు

భారత క్రికెట్ లో పృథ్వీ షాది ప్రత్యేకమైన ప్రస్థానం అనడంలో సందేహం లేదు. మరో సచిన్ టెండూల్కర్ అనుకున్న వ్యక్తి ఇప్పుడు అనామకంగా మిగిలాడు. ఎంతవేగంగా అంతర్జాతీయ యవనికలో అడుగు పెట్టాడో అంతే వేగంగా తెరమరుగైయ్యాడు. భారత్ తరపున ఐదు టెస్టులు, ఆరు వన్డేలు, ఒక టీ20 ఆడిన షా.. ఆ తర్వాత జాతీయ జట్టు కాదు కదా.. కనీసం డొమెస్టిక్ లెవల్లో కూడా సత్తా చాట లేక పోయాడు. తాజాగా అతని గురించి షా మిత్రుడు, ఐపీఎల్ సంచలనం శశాంక్ సింగ్ వ్యాఖ్యానించాడు. తనకు 13 ఏళ్ల వయుసున్నపటి నుంచి షా తనకు తెలుసని, కొన్ని కారణాల వల్ల అతని డౌన్ ఫాల్ స్టార్ట్ అయిందని వ్యాఖ్యానించాడు. నిజానికి షాకు ఇప్పుడు చాలా కష్టకాలం నడుస్తోంది. ఐపీఎల్ 2025లో అన్ సోల్డ్ గా మిగిలిన షా.. విజయ్ హజారేట్రోఫీ, రంజీ ట్రోఫీలలో ముంబై జట్టు నుంచి కూడా ఉద్వాసనకు గురయ్యాడు. తాజాగా రూట్ మొబైల్ కప్పులో తను బరిలోకి దిగాడు. షా చాలా అండర్ రేటెడ్ క్రికెటర్ అని, తను సత్తా చాటడం భారత క్రికెట్ కు ముఖ్యమని శశాంక్ అభివర్ణించాడు. యశస్వి జైస్వాల్, శుభమాన్ గిల్ స్థాయిలో తను ఓపెనర్ గా ఎదిగేవాడని, అయితే కొన్ని కారణాల వల్ల తన డౌన్ ఫాల్ ప్రారంభమైందని పేర్కొన్నాడు. ఇప్పటికైనా కొన్ని మార్పులు చేస్తే, తను తిరిగి గాడిలో పడతాడని పేర్కొన్నాడు. పది గంటలకే పడుకోవడం, స్ట్రిక్టు డైట్ పాటించడం, మరికొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా తను బౌన్స్ బ్యాక్ కాగలడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ మార్పులతో తనకు ఎదురే ఉండబోదని వ్యాఖ్యానించాడు. నిజానికి గత సీజన్ శశాంక్ సింగ్ కెరీర్ కు టర్నింగ్ పాయింట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. వేలంలో అనూహ్యంగా శశాంక్ ను కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్ కు లక్కు కలిసొచ్చింది. ఈ సీజన్లో 165 స్ట్రైక్ రేట్ తో 354 పరుగులు సాధంచాడు. ఎన్నో మ్యాచ్ ల్లో కీలక ఇన్నింగ్స్ తో ఆకట్టుకున్నాడు. పంజాబ్ తో పాటు మిగతా క్రికెట్ ప్రేమికుల మనసు దోచాడు. దీంతో అతనిపై ఫ్రాంచైజీ ఎనలేని విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. పంజాబ్ తరపు మొట్టమొదటి రిటెన్షన్ గా శశాంక్ నే ఎంచుకోవడం విశేషం. 5.5 కోట్ల రూపాయలతో తనను రిటైన్ చేసుకుంది. తను అన్ క్యాప్డ్ ప్లేయర్ కాబట్టి, ఆ ధర పలికింది. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి క్యాప్డ్ ప్లేయర్ కేటగిరీలో ఉన్నట్లయితే తనకు భారీ ధర పలికేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక గతేడాది గూగుల్లో అత్యధిక మంది సెర్చ్ చేసిన అథ్లెట్లలో శశాంక్ పేరు ప్రముఖంగా నిలిచింది. ఒక్క హార్థిక్ మాత్రమే ఈ జాబితాలో టాప్-10లో నిలిచాడు. ఈ ఏడాది పంజాబ్ కింగ్స్ తరపున బరిలోకి దిగనున్న శశాంక్.. నూతన సారథి శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఆడనున్నాడు.






# రేపు ఐపీఎల్ జట్ల కెప్టెన్లతో బోర్డు సమావేశం

ఐపీఎల్ వారంలోకి వచ్చేశాం. ఈనెల 22 నుంచి మెగాటోర్నీ ప్రారంభం కాబోతోంది. కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ తో ఐపీఎల్ 2025 అధికారికంగా ప్రారంభం కాబోతోంది. అయితే అంతకన్నా ముందే ఈనెల 20న అన్ని జట్ల కెప్టెన్లతో సమావేశాన్ని బీసీసీఐ ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశం బోర్డు హెడ్ క్వార్టర్ అయిన ముంబైలో జరుగుతుంది. క్రికెట్ సెంటర్లో నాలుగు గంటలపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. తొలి గంటలో ఈ సీజన్ లోని మార్పులు గురించి, ఆ తర్వాత స్పాన్సర్లకు సంబంధించిన కార్యక్రమాలు, ఆ తర్వాత కెప్టెన్లతో ఫొటో షూట్ నిర్వహించనున్నారు. ఇక ఈ టోర్నీలో ఇప్పటికే అన్ని జట్ల కెప్టెన్ల ప్రకటన కూడా పూర్తయ్యింది. చెన్న సూపర్ కింగ్స్ ( కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (రజత్ పాటిదార్), సన్ రైజర్స్ హైదరాబాద్ (పాట్ కమిన్స్), ముంబై ఇండియన్స్ (హార్దిక్ పాండ్యా), గుజరాత్ టైటాన్స్ (శుభమాన్ గిల్), కోల్ కతా నైట్ రైడర్స్ (అజింక్య రహానే), లక్నో సూపర్ జెయింట్స్ (రిషభ్ పంత్), ఢిల్లీ క్యాపిటల్స్ (అక్షర్ పటేల్), రాజస్థాన్ రాయల్స్ (సంజూ శాంసన్), పంజాబ్ కింగ్స్ (కెప్టెన్ శ్రేయస్ అయ్యర్) ఐపీఎల్ 2025లో పాల్గొంటున్నాయి. ఐపీఎల్ షెడ్యూల్ గతంలోనే ప్రకటించారు. ఈసారి 74 మ్యాచ్ లను ఆడనున్నారు. అందులో 12 డబుల్ హెడర్లు అంటే ఒకేరోజు రెండు మ్యాచ్ లు ఉండనున్నాయి. తొలి డబుల్ హెడర్ ఆదివారం జరుగుతుంది. తొలి మ్యాచ్ లో సన్ రైజర్స్, రాజస్థాన్ మధ్య మ.3.30 గం.లకు మ్యాచ్ జరుగుతుంది. ఆ తర్వాత సా.7.30 గం.లకు చెన్నైతో ముంబై తలపడనుంది. ఆ తర్వాత వైజాగ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తో లక్నో సూపర్ జెయింట్స్ , మార్చి 25న అహ్మదాబాద్ లో గుజరాత్ తో పంజాబ్ ఆడనుంది. లీగ్ దశ ముగిశాక, ఫైనల్ కి వెళ్లే జట్లను నిర్ణయించే క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్ లను ఈసారి హైదరాబాద్ లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ మైదానంలో నిర్వహిస్తున్నారు. మే20న క్వాలిఫయర్-1, తర్వాతిరోజు ఎలిమినేటర్ మ్యాచ్ లను నిర్వహిస్తారు. 23న కోల్ కతాలో క్వాలిఫయర్ -2ను నిర్వహిస్తారు. మే25న కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో ఫైనల్ మ్యాచ్ నిర్వహించున్నారు. చెన్నై, ముంబై చెరో ఐదు ట్రోఫీలతో లీగ్ లో అత్యంత విజయవంతమైన జట్లుగా నిలిచాయి. గతేడాది కప్పును కోల్ కతా నైట్ రైడర్స్ గెలుపొందింది. ఫైనల్లో సన్ రైజర్స్ ను ఓడించి మూడోసారి టైటిల్ ను కైవసం చేసుకుంది. ఇక 2016లో చివరిసారి కప్పు గెలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్.. 2018, 2024లో రెండుసార్లు తుదిమెట్టుపై బోల్తా పడింది. దీంతో ఈసారి ఎలాగైనా కప్పు సాధించాలని పట్టుదలగా ఉంది. ఈసారి బ్యాటింగ్ ను మరింత బలంగా మార్చడంతోపాటు, బౌలింగ్ నూ పటిష్ట పరిచింది.

# రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడు

- ఆర్‌సీబీ భవిష్యత్తు అతనే..:పటీదార్‌పై కోహ్లీ ప్రశంసల జల్లు



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) నయా సారథి రజత్ పటీదార్‌పై ఆ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడని కొనియాడాడు. ఆర్‌సీబీ భవిష్యత్తు అతనేనని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ముంగిట ఆర్‌సీబీ.. తమ నూతన సారథిగా యువ ప్లేయర్ అయిన రజత్ పటీదార్‌ను నియమించిన విషయం తెలిసిందే.అప్‌కమింగ్ సీజన్ నేపథ్యంలో ఆర్‌సీబీ సోమవారం.. చిన్నస్వామి స్టేడియంలో అన్‌బాక్స్ ఈవెంట్ నిర్వహించింది. అప్‌కమింగ్ సీజన్‌తో పాటు టీమ్ కాంబినేషన్ గురించి కోహ్లీ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఈ క్రమంలోనే రజత్ పటీదార్‌ను కొనియాడుతూ.. అతనికి మద్దతుగా నిలవాలని ఫ్యాన్స్‌ను కోరాడు. 'రజత్ పాటిదార్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. ఆర్‌సీబీని విజయవంతంగా నడిపించడమే కాకుండా అభిమానుల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ఉంది. ఈ ఫ్రాంచైజీ అతనిపై పెట్టుకున్న ఆశల్ని అతను తప్పక నెరవేరుస్తాడనే నమ్మకం ఉంది. తప్పకుండా ఆర్‌సీబీని గెలుపు బాటలో నడిపిస్తాడు. సారథిగా ఎదగడానికి కావాల్సిన అన్ని అర్హతలు, ప్రతిభ అతనిలో ఉన్నాయి.'అని విరాట్ కోహ్లీ తెలిపాడు.ఐపీఎల్ 2021లో ఆర్‌సీబీ తరపున అరంగేట్రం చేసిన రజత్ పటీదార్.. 4 మ్యాచ్‌లు ఆడి 71 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ పేలవ ప్రదర్శనతో ఆర్‌సీబీ తర్వాతి సీజన్‌కే అతన్ని వేలంలోకి వదిలేసింది. ఐపీఎల్ 2022 వేలంలో అతన్ని ఏ జట్టు కూడా కొనుగోలు చేయలేదు. దాంతో అన్‌సోల్డ్‌గా నిలిచాడు. అయితే ఐపీఎల్ 2022 సీజన్ ముంగిట ఆర్‌సీబీ తీసుకున్న అనామక ప్లేయర్ లవ్‌నీత్ సిసోడియా గాయపడటంతో అతని స్థానంలో అనూహ్యంగా రజత్ పటీదార్ జట్టులోకి వచ్చాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయడంతో అతనికి ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ తుది జట్టులో చోటిచ్చింది. రూ. 20 లక్షల కనీస ధరతోనే జట్టులోకి వచ్చిన అతను ఆ సీజన్‌లో 8 మ్యాచ్‌ల్లో 55.50 సగటుతో 333 పరుగులు చేశాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలతో పాటు ఓ శతకం సాధించాడు. అది కూడా లక్నో సూపర్ జెయింట్స్‌తో ఎలిమినేటర్ మ్యాచ్‌లో 54 బంతుల్లో 112 పరుగులతో అజేయంగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో సెంచరీ చేసిన తొలి అనామక ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ సెంచరీ ఇన్నింగ్స్ పటీదార్ తలరాతను మార్చేసింది. కానీ గాయం కారణంగా తర్వాతి ఐపీఎల్ 2023 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అతనిపై నమ్మకం ఉంచిన ఆర్‌సీబీ అండగా నిలిచింది. ఐపీఎల్ 2024 సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చిన అతను 15 మ్యాచ్‌ల్లో 5 హాఫ్ సెంచరీలతో 395 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో ఆర్‌సీబీ అతన్ని రూ. 11 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకుంది. గత సీజన్ వరకు జట్టును నడిపించిన ఫాఫ్ డుప్లెసిస్‌ను వదిలేయడంతో తమ సారథిగా రజత్ పటీదార్‌ను నియమించింది. గాయపడిన ఆటగాడికి రిప్లేస్‌మెంట్‌గా రూ. 20 లక్షల కనీస ధరతో జట్టులోకి వచ్చిన రజత్ పటీదార్.. మెరుగైన ప్రదర్శనతో రూ. 11 కోట్ల ధరను అందుకోవడంతో పాటు ఇప్పుడు ఏకంగా ఆర్‌సీబీ సింహాసనంపైనే కూర్చున్నాడు.

తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు


# విష్ణుప్రియ, టేస్టీతేజకు నోటీసులు



బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పంజాగుట్ట పోలీసులు విచారణను వేగవంతం చేశారు. యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోటు చేస్తున్న టీవీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సహా మంది పోలీసులు సోమవారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ, యూట్యూబర్, కమెడియన్ టేస్టీ తేజకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో ఆదేశించారు. విచారణ తర్వాత మరికొందరికి సైతం విచారణకు రావాలని నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేసిన ఇతర వ్యక్తులపై సైతం పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్స్, టీవీ నటుల్లో పలువురిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. యాంకర్లు విష్ణుప్రియ, శ్యామల, హర్షసాయి, ఇమ్రాన్ ఖాన్, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, రీతూ చౌదరి, సుప్రీత, సుధీర్, అజయ్, సన్నీ యాదవ్ పలువురిపై పలు సెక్షన్లతో పాటు యాక్టుల కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటికే సేకరించిన యాప్స్ లింక్స్ ఆధారంగా పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం.

# అత్యధికంగా పన్ను చెల్లించిన బిగ్‌బీ

బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. అత్యధిక పన్ను చెల్లిస్తున్న సెలబ్రిటీగా చరిత్రకెక్కాడు. 2024-2025 సంవత్సరానికి బిగ్ బీ అమితాబ్.. సుమారు 120 కోట్ల ఆదాయ పన్ను చెల్లించారు. పన్ను చెల్లింపుల్లో ఆయన షారూక్ ఖాన్, విజయ్‌లను దాటేశారు. గత ఏడాది షారూక్ ఖాన్ 92 కోట్ల ట్యాక్స్ చెల్లించారు. అయితే ఇప్పుడు ఆ రికార్డును బాలీవుడ్ నటుడు అమితాబ్ చెరిపేశారు. 82 ఏళ్ల ఆ స్టార్ నటుడు 2024-25 సంవత్సరానికి 120 కోట్ల పన్ను కట్టారు. కల్కి 2898 ఏడీ, వెట్టియాన్ చిత్రాల్లో అమితాబ్ నటనపై ప్రశంసలు కురిశాయి. బ్రాండ్ ఎండోర్స్‌మెంట్లతోనూ బిగ్ బీ ఆర్జన రెట్టింపు అయ్యింది. కౌన్ బనేగా కరోడ్‌పతి సీజన్ 16 ద్వారా కూడా ఆయన ఆదాయం పెరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వార కూడా అమితాబ్ తన ఆదాయాన్ని పెంచుకున్నది. చిత్రాలు, టాప్ బ్రాండ్లకు ప్రమోటర్‌గా



అమితాబ్ అత్యధిక స్థాయిలో ఆర్జిస్తున్నారు. అయితే 2024-25 సంవత్సరానికి ఆయన సుమారు 350 కోట్లు ఆర్జించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తుల్లో అత్యధికంగా ఆర్జిస్తున్న ఆర్టిస్టుగా అమితాబ్ నిలిచారు. పన్ను చెల్లింపుల్లో దేశ ప్రజలకు అమితాబ్ రోల్‌మోడల్‌గా ఉంటాడని ఓ వ్యక్తి తెలిపారు. సెక్షన్ 84, కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లో కూడా అమితాబ్ నటిస్తున్నాడు.

# మహేష్‌బాబు సినిమాలో ప్రియాంకచోప్రా క్యారెక్టర్ లీక్..?

దర్శకధీరుడు రాజమౌళి, మహేష్ బాబు కాంబోలో ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీ29 అనే చిత్రం స్లో అండ్ స్టడీగా చిత్రీకరణ జరుపుకుంటుంది. ఒడిశాలో ఈ మూవీ షూటింగ్ జరుపుకుంటున్నట్టు తెలుస్తుండగా, అక్కడ షూట్ ప్రారంభించిన మొదటి రోజే ఓ వీడియో లీక్ అయింది. జక్కన్న తీసిన సీన్స్ అన్ని లీక్ కావడంతో ఆయన షూటింగ్‌లో ఇప్పుడు చాలా స్ట్రిక్ట్ యాక్షన్ అమలు చేస్తున్నట్టు తెలుస్తుంది. అయితే తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తుంది. ఇందులో ప్రియాంక చోప్రా ముఖ్య పాత్ర పోషిస్తుండగా, ఆమెని నెగెటివ్‌గా జక్కన్న చూపించబోతున్నట్టు సమాచారం. ఇక ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇంకా అధికారిక ప్రకటన రాని నేపథ్యంలో ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. రాజమౌళి సినిమా అంటే ట్విస్ట్‌లు మాములుగా ఉండవు. ఏది చేసిన కూడా అది సంచలనమే అవుతుంది. ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ వార్తలలో నిజమెంత ఉందనేది తెలియాల్సి ఉంది. ఇక రాజమౌళి తన సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు కేవలం నటన, టెక్నికల్ అంశాల్లోనే కాకుండా సెట్ లో క్రమశిక్షణ మరియు పర్యావరణంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనే విషయం మనకు తెలిసిందే. ఇది మరో సారి వెల్లడైంది. మహేష్ తో షూటింగ్ చేస్తున్న ఆ లోకేషన్ లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించారు. కఠిన నిబంధనలతో షూటింగ్ ఈ మూవీ సెట్ లో రాజమౌళి అమలు చేస్తున్నట్లు తెలుస్తుంది. హీరో మహేష్ బాబుకు ఇద్దరూ ప్రియాంక చోప్రా కు ఇద్దరు అసిస్టెంట్లకు మాత్రమే లొకేషన్లో పర్మిషన్ ఇవ్వగ మిగతా ఆర్టిస్టులకు ఒక్కొక్కరికి ఒక అసిస్టెంట్ మాత్రమే అనుమతిచ్చారట జక్కన్న. నిజానికి ప్రియాంక చోప్రా కు మేకప్ మరియు వ్యక్తిగత సహాయకులగా దాదాపు 13 మంది ఉంటారు కానీ ఈ సెట్లో కేవలం ఇద్దరికీ మాత్రమే అనుమతి ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ ఒడిశా లోని కోరాపూట్ జిల్లాలో జరుగుతుంది.



# అభినయకు కాబోయే భర్త విశాల్ కాదు..కార్తీక్



తమిళనాడుకు చెందిన అభినయ తెలుగు ప్రేక్షకులకి కూడా చాలా సుపరిచితం. అభినయ మొదటి తెలుగు సినిమా 2009లో వచ్చిన “నాడోడిగల్” మలయాళ సినిమాకు రీమేక్ అయిన “శంభో శివ శంభో”. రవితేజ హీరోగా వచ్చిన శంభో శివ శంభో సినిమాలో అవకాశం దక్కించుకొని చాలా ఫేమస్ అయింది. అలానే సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో మహేష్ బాబు, వెంకటేష్ ల సోదరిగా కూడా నటించి ప్రశంసలు అందుకుంది. ఆమె నటనతో ఎంతోమంది ప్రేక్షకులను మెప్పించారు. కింగ్, దమ్ము, ధ్రువ, సీతా రామం, గామీ తదితర తెలుగు సినిమాలతో తెలుగు ప్రేక్షకులకి చాలా దగ్గరైన అభినయ .. మార్క్ ఆంటోనీ వంటి డబ్బింగ్ సినిమాలతోనూ తెలుగు ఆడియెన్స్ ని మెప్పించింది. అయితే కొద్ది రోజుల క్రితం అభినయ నిశ్చితార్థం చేసుకుంది. ఉంగరాలు మార్చుకొని, గుడిగంటలు కొడుతున్న ఫొటోని పంచుకుంది. దీంతో అభినయ పెళ్లి చేసుకోబోయే వ్యక్తి ఎవరు, ఆయన బ్యాక్‌గ్రౌండ్ ఏంటి అనే విషయాల గురించి ఆరాలు తీసారు. కొందరైతే విశాల్‌తో ఈ అమ్మడి వివాహం జరగబోతుందంటూ ప్రచారాలు చేశారు. కాని అభినయ కు కాబోయే భర్త పేరు కార్తీక్. కొద్ది రోజుల క్రితం ఇతని పుట్టిన రోజు సందర్భంగా ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను షేర్ చేసి అందరిలో ఉన్న అనేక అనుమానాలని పటాపంచలు చేసింది.కార్తీక్.. హైదరాబాద్‌కి చెందిన వ్యక్తి కాగా, ప్రముఖ బిజినెస్ మ్యాన్ అని తెలుస్తోంది. హైదరాబాద్‌లోనే అతను పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక అభినయతో అతనికి 15 సంవత్సరాల నుంచే పరిచయముందని, ఇద్దరూ ప్రేమలో కూడా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారట. మరి పెళ్లి తేది ఎప్పుడు ప్రకటిస్తుందో చూడాలి. ఏది ఏమైన అభినయ పెళ్లి పీటలు ఎక్కుతున్ననేపథ్యంలో ఆమెకి ప్రముఖులు, నెటిజన్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# షారుఖ్‌ఖాన్‌తో సుకుమార్ సినిమా?

పుష్ప ది రూల్ సినిమాతో నేషన్ వైడ్ బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు సుకుమార్. అయితే ఈ ప్రాజెక్ట్ అనంతరం సుకుమార్ ఎవరితో సినిమా చేయబోతున్నాడా అని మూవీ లవర్స్ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ సినీ వర్గాల ప్రకారం సుకుమార్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ రామ్ చరణ్‌తో ‘17’ చేస్తాడని అంటుండగా.. మరోవైపు ‘పుష్ప 3’ కథ రాసే పనిలో ఉన్నడని టాక్ వినిపిస్తుంది. ఇదిలావుంటే.. ఈ రెండు కాకుండా మరో క్రేజీ పాన్ ఇండియా కాంబో తెరమీదకు వచ్చింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్, దర్శకుడు సుకుమార్ కలిసి ఒక ప్రాజెక్ట్ చేయబోతున్నారని ప్రస్తుతం వార్తలు వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు కలిసి ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ కోసం చేతులు కలపబోతున్నట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే సుకుమార్ పేరు బాలీవుడ్‌లో మారుమోగడం ఖాయం. రూరల్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథతో ఈ సినిమా రాబోతుండగా.. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమాలో షారుఖ్ ఖాన్‌ను విలన్ పాత్రలో చూపించే ఆలోచనలో సుకుమార్ ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# వరుస సినిమాలతో స్పీడ్‌పెంచిన రితికాసింగ్





తెలుగులో పెద్దగా కనిపించక పోయినా తమిళ్ లో సినిమాలు చేస్తుంది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన ‘సాలా ఖదూస్’ మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు తెలుగుతోపాటు తమిళం, మలయాళం చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంటుంది.

చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన ‘సాలా ఖదూస్’ మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. విక్టరీ వెంకటేశ్ నటించిన గురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రితికా సింగ్. ఈ మూవీ తర్వాత అంతగా ఆఫర్స్ రాలేదు.. గురు సినిమా తర్వాత తర్వాత విజయ్ సేతుపతితో కలిసి ఆండవన్ కట్టలై, అలాగే రాఘవ లారెన్స్ సరసన శివలింగ సినిమాల్లో నటించింది రితిక. ఈ రెండు చిత్రాలు కూడా హిట్ గా నిలిచాయి. గురు తర్వాత నేరుగా మరే తెలుగు సినిమాలోనూ నటించలేదు రితిక. కేవలం నీవెవ్వరో అనే సినిమాలో కనిపించింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా రజనీకాంత్ వెట్టయాన్ సినిమాలో నటించింది. వెట్టయాన్ చిత్రంలో కీలకపాత్ర పోషించింది. ఇందులో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ఆకట్టుకుందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే.. రితిక సోషల్ మీడియలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ చేసే వర్కౌట్లకు అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతుంటారు. అలాగే కొన్ని క్రేజీ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది ఈ వయ్యారి భామ. తాజాగా రితిక షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.

Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656